Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 164 మేడ్చల్ మల్కాజ్‌గిరి 5 జూలై 2023 బుధవారం పేజీలు : 4

## బీజేపీ ముఖ్య నేతలకు కాంగ్రెస్ గాలం?

బెంగళూరు : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 20కు పైగా నియోజకవర్గాలను కైవసం చేసుకోవాలని గట్టిపట్టుతో ఉన్న కాంగ్రెస్ ఆ దిశగా ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించింది. ఇం దులో భాగంగా ప్రముఖ బీజేపీ నేతలకు గాలం వేస్తోంది. బీజేపీ అధిష్టానం పెద్దలు, రాష్ట్రంలోని కొందరు సీనియర్ నేతల తీరుపై అసంతృప్తితో రగిలిపోతున్న నేతలతో కాంగ్రెస్ నేతలు టచ్‌లో ఉన్నట్లు సమాచారం. వీరిలో మాజీ సీఎం యడియూరప్పకు అత్యంత సన్నిహితుడైన మాజీ ఎమ్మెల్యేలు ఎంపీ రేణుకాచార్య, రాజుగౌడ, శంకరపాటిల్ మునేనకొప్ప, జేసీ మాధుస్వామి, ఎమ్మెల్యే ఎస్‌టీ సోమశేఖర్, కరడి సంగణ్ణ, బలహీనవర్గాల కమిషన్ చైర్మన్ జయప్రకాష్ హెగ్డే పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరు గాక ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో టికెట్లు దక్కకపోవచ్చునని గట్టిగా భావి స్తున్న సుమారు ఆరుగురు బీజేపీ ఎంపీలు కూడా కాంగ్రెస్ నేతలతో లోపాయికారిగా టచ్‌లో ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

# 'కారు'కు 90 సీట్లు సాధ్యమేనా!?

## కాంగ్రెస్ - బిజెపిలను కేసీఆర్ కట్టడి చేయగలరా!?

## మూడో సారి విజయంపై దృష్టి పెట్టిన 'కారు సారు'



హైదరాబాద్ : తెలంగాణ సీఎం కేసీఆర్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలో సంవత్సరాంతంలో ఎన్నికలు ఉంటాయని కేసీఆరే స్వయంగా ప్రకటించారు. ఆ లోపు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని నేతలకు దిశా నిర్దేశం చేశారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దని అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని అన్నారు. ఇప్పటి వరకు వస్తున్న సర్వే ప్రకారమైతే వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ కే అనుకూల పవనాలు వీస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ ఎన్నికల సమయానికి బీజేపీ కాంగ్రెస్ లు పుంజుకుంటే చెప్పలేమని కొందరు అంటున్నారు. ఈ తరుణంలో కేసీఆర్ అనుకున్న 90 సీట్లు వస్తాయా? ఆ దమ్ము కేసీఆర్ లో ఉందా? అనే చర్చ సాగుతోంది. 2014 2018 వరుసగా సీఎం పీటంపై కూర్చున్న కేసీఆర్ మొదటి ఐదేళ్లు తిరుగులేని పాలన అందించారు. సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు శరవేంగా చేయడంతో ప్రజలు కొత్త ప్రభుత్వ పాలనను ఆదరించారు. ప్రతిపక్షాలు సైతం ఐదేళ్లు వేచి చూడాలి అన్న ధోరణితో ఉండడంతో కేసీఆర్ పలు ప్రాజెక్టులకు ఓకే చెప్పారు. వీటిలో రైతుబంధు ఆసరా పింఛన్ పథకాలు ప్రజలను ఆకర్షించాయి. దీంతో రెండోసారి అధికారంలోకి రావడానికి కేసీఆర్ కు పెద్దగా కష్టం కాలేదు. ఆ సమయంలో ప్రతిపక్షాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చినా కేసీఆర్ ను ఢీకొట్టలేకపోయాయి. 2018 ఎన్నికల్లో కొన్ని సీట్లు కాంగ్రెస్ గెలుచుకున్నా వారందరికీ గులాబీ కండువా కప్పడంతో ఆ పార్టీ పూర్తిగా బలహీనంగా మారిపోయింది. దీంతో కేసీఆర్ కు ఎదురు లేకుండా పోయింది. అయితే రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని పథకాల విషయంలో నిర్లక్ష్యం చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం దళితుకు మూడెకరాల భూమి దళితబంధు లాంటి పథకాలను ఆడంబరంగా ప్రవేశపెట్టినా వీటి అమలులో ఎన్నో సమస్యలు ఎదురవుతున్నాయి. వీటికి తోడు ధరణి పోర్టల్ సమస్య బీఆర్ఎస్ కు మైనస్ గా మారుతోంది. ఇదే సమయంలో అనూహ్యంగా కాంగ్రెస్ పుంజుకోవడం ప్రారంభించింది. బిజెపికి కూడా దుబ్బాక హుజూరాబాద్ ఉప ఎన్నికలు గెలుచుకున్న తరువాత బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయం తామే అని ప్రచారం చేసుకుంటున్నారు. అటు కాంగ్రెస్ సైతం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో చాపకింద నీరులా డెవలప్ అవుతోంది. అయితే కేసీఆర్ జాతీయ రాజకీయాల్లోకి వెళ్లేందుకు టీఆర్ఎస్ ను బీఆర్ఎస్ గా మార్చారు. తెలంగాణలో కేంద్రంలో అధికారంలోకి రావడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ సమస్యలతో పాటు కొన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు మంత్రలు భారీ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీరిపై కేసీఆర్ కు నివేదికలు వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. అయితే ఈసారి టిక్కెట్ల విషయంలో కేసీఆర్ కొందరి గురించి ఆలోచిస్తారని అంటున్నారు. సిట్టింగులకే సీట్లు వస్తాయని కేసీఆర్ చెప్పడంతో అలాంటి వారిలో గుబులు ఏర్పడింది. కొన్ని సర్వేలు బీఆర్ఎస్ కు అనుకూల పవనాలు వీస్తున్నట్లు చెబుతున్నా.. క్షేత్రస్థాయికి వెళ్లేసరికి మాత్రం ప్రత్యామ్నాయ పార్టీ గురించి ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ తరుణంలో అన్ని నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ కు పట్టం కడుతారని అనుకోవడం లేదని కొందరు అంటున్నారు. బీఆర్ఎస్ 2 ప్రభుత్వంతో లాభపడిన వారు మినహాయిస్తే చాలా వరకు ప్రజలు మూడోసారి ఓటేయ్యడంపై తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. కానీ కేసీఆర్ ఎన్నికల సమయం నాటికి ఏదోలా పార్టీ గట్టెక్కేలా చర్యలు తీసుకుంటారని కొందరు అనుకుంటున్నారు.

## ప్రధాని మోదీ వరంగల్ పర్యటన షెడ్యూల్ ఖరారు

వరంగల్: ఈనెల 8న ప్రధాని మోదీ వరంగల్‌లో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారైంది. మోదీ 8న ఉదయం దిల్లీ నుంచి బయల్దేరి ఉదయం 9.45కి హైదరాబాద్‌లోని హకీంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. 9.50కి హెలికాప్టర్‌లో వరంగల్‌కు బయల్దేరతారు.



10.35కి అక్కడి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 10.45 నుంచి 11.20 వరకు పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. 11.30 నుంచి మధ్యాహ్నం 12.10 వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం 12.15కి వరంగల్‌లో హెలికాప్టర్‌లో బయల్దేరి 1.10కి హకీంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో రాజస్థాన్ పర్యటనకు ప్రధాని వెళ్లనున్నారు.

## ఏపీలో కిరణ్ రెడ్డికి.. తెలంగాణలో ఈటలకు కీలక పదవులు.. ఈ ఇద్దరికే ఎందుకంటే..!?




అవును.. తెలుగు రాష్ట్రాల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీజేపీ అగ్రనాయకత్వం భారీగా మార్పులు, చేర్పులు చేసింది. ముఖ్యంగా తెలంగాణలో ఎట్టి పరిస్థితుల్లో గులాబీ బాస్ కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని కానివ్వకూడదని బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యూహాత్మకంగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిని మార్చింది. ఇప్పటి వరకూ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను పక్కనెట్టి కేంద్ర మంత్రి, కిషన్ రెడ్డికి అధ్యక్ష పదవి కట్టబెట్టింది. అయితే బండిని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇక ఏపీ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురంధేశ్వరిని ఎవరూ ఊహించని రీతిలో నియమించడం గమనార్హం. ఇవన్నీ అటుంచితే తెలంగాణ నుంచి సీనియర్ నేత, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు .. ఏపీ నుంచి మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డికి బీజేపీ అధిష్టానం కీలక పదవులు ఇచ్చింది. ఈ ఇద్దరికి పదవులు ఏంటి..? తెలుగు రాష్ట్రాల నుంచి ఈ ఇద్దర్నే ఎందుకు నియమించింది..? అనే ఇంట్రెస్టింగ్ విషయాలను ప్రత్యేక కథనంలో తెలుసుకుందాం..

**కీలక పదవులు ఏమిటంటే..** ఎన్నికల సమయంలో బీజేపీ దూకుడు పెంచింది. వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు, త్వరలో పలు రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సంస్థాగతంగా బీజేపీ కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాలకు అధ్యక్షులను మార్చడమే కాకుండా పలువురు సీనియర్లకు ప్రమోషన్ ఇచ్చింది బీజేపీ అధిష్టానం. ముఖ్యంగా.. కిరణ్ కుమారెడ్డికి బీజేపీ జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా, ఈటల రాజేందర్‌కు తెలంగాణ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా కీలక పదవులను కట్టబెట్టింది. అయితే ఈ ఇద్దర్నీ కీలక పదవులు వరించడంతో ఇప్పుడు తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీలోనూ ఈ ఇద్దరి గురించే పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు. వాస్తవానికి బీజేపీలో కీలక పదవులు పొందాలంటే కచ్చితంగా ఆర్ఎస్ఎస్ బ్యాగ్రౌండ్ ఉండాల్సిందేనని కొందరు రాజకీయ విశ్లేషకులు చెబుతుంటారు. అయితే ఈటల, కిరణ్ రెడ్డికి ఆ బ్యాగ్రౌండ్ లేకపోయినప్పటికీ కీలక పదవులు వరించడంతో హాట్ టాపిక్ అయ్యారు.

**ఈటలకే ఎందుకిచ్చారంటే..! :** బీఆర్ఎస్‌లో పరిస్థితులు అనుకూలించక.. తిరుగుబాటు చేసిన ఈటల రాజేందర్ 'కారు' (బీఆర్ఎస్) దిగి.. కాషాయ కండువా కప్పుకున్నారు. అంతేకాదు.. తనకున్న ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మరీ హుజురాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి గెలిచి నిలిచారు. ఆ మరుసటి రోజు నుంచే ఈటలకు కీలక పదవి ఇస్తారని టాక్ నడిచింది కానీ అదేమీ జరగలేదు. ఉద్యమ నాయకుడిగా, బీసీ నాయకుడిగా ఈటలకు మంచి గుర్తింపు ఉంది. వీటన్నింటికీ మించి బీఆర్ఎస్ లోటుపాట్లు బాగా తెలిసిన వ్యక్తిగా.. సీఎం కేసీఆర్‌ను ఢీకొనే ఏకైక నేతగా భావించిన బీజేపీ నాయకత్వం ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమించిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎమ్మెల్యేలుగా రఘునందనరావు, రాజాసింగ్.. ఇంకా చాలా మంది సీనియర్ నేతలు బీజేపీలో ఉన్నప్పటికీ.. ఈటలకు ఇస్తేనే అన్ని విధాలుగా న్యాయం చేస్తారని, కేసీఆర్‌తో ఢీ కొనడానికి ఇతనే కరెక్టని అధిష్టానం భావించింది గనుకే కీలక పదవి కట్టబెట్టినట్లు కూడా మరోవైపు చర్చ జరుగుతోంది. వాస్తవానికి రాజేందర్‌కు ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా నియమించే అవకాశాలు ఉన్నాయని చాలా రోజులుగా ప్రచారం జరిగింది. సీన్ కట్ చేస్తే.. అంతకుమించి కీలక బాధ్యతలనే అధిష్టానం కట్టబెట్టింది.




# తెలంగాణ రాబడి అదరహో...!

## 2021-22లో రూ. 1,42,688.79 కోట్లు
## 2022-23లో రూ.1,54,518.17 కోట్లు

హైదరాబాద్ : కేంద్రంలోని నరేంద్రమోదీ సర్కార్ ఎన్ని ఆంక్షలు విధించినా తెలంగాణ ఆర్థికంగా నిలదొక్కుకుంటూనే ఉన్నది. రాబడులను పెంచుకుంటూ సొంత కాళ్లపై నిలబడుతున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరంలోని తొలి 10 నెలల్లో (ఏప్రిల్ నుంచి జనవరి వరకు) పన్నుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1,54,518.17 కోట్ల రాబడి వచ్చింది. ఇది బడ్జెట్ అంచనా (రూ. 2,45,256.61 కోట్లు)లో 63 శాతానికి సమానం. ఇందులో సొంత పన్నుల రూపేణా రూ. 1,05,167.52 కోట్లు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) ద్వారా రూ. 34,729 కోట్లు, అమ్మకం పన్ను ద్వారా రూ. 24,745 కోట్లు, ఎక్సైజ్ సుంకాల ద్వారా రూ. 14,598 కోట్లు, స్టాంపులు, రిజిస్ట్రేషన్ ద్వారా రూ. 11,806 కోట్లు, కేంద్ర పన్నుల్లో వాటా కింద రూ. 9,205 కోట్లు, కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా రూ. 7,876 కోట్లు, ఇతర పన్నులు, సుంకాల రూపంలో రూ. 7,112 కోట్లు, పన్నేతర రాబడి కింద రూ. 10,405 కోట్లు వచ్చాయి. 2021-22లో పన్నుల ద్వారా మొత్తం రూ. 2,21,686 కోట్ల రాబడి వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేయగా తొలి 10 నెలల్లో రూ. 1,42,688.79 కోట్లు వచ్చాయి.

దీనితో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో పన్నుల రాబడి గణనీయంగా పెరిగిందని, అందులో రెవెన్యూ వ్యయం 1,24,681.68 కోట్లుగా ఉన్నదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు రాష్ట్ర ఆర్థిక శాఖ నివేదించింది.

# సంపాదకీయం

## రష్యా ఆర్థికవ్యవస్థను కుప్పకూల్చేందుకు అమెరికా ప్లాన్లు?

ప్రపంచ చరిత్రలోనే అత్యంత కఠిన ఆంక్షలు రష్యా ఎదుర్కొంటోందా? అంటే ఔననే అంటున్నాడు అమెరికా అధ్యక్షుడు జోబిడెన్. ఈ మేరకు ఉక్రెయిన్ పై దాడికి దిగిన రష్యాపై కఠిన చర్యలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. రష్యాపై ఆంక్షలు విధించడంలో ప్రపంచ దేశాలు తమతో కలిసి నడిచాయని తెలిపారు. దీంతో రష్యా ఆర్థిక వ్యవస్థ తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటోందన్నారు. ఆంక్షలతో రష్యా ఆర్థిక వ్యవస్థ పాతాళానికి పడిపోయిందని.. ఆ దేశ కరెన్సీ రూబుల్ విలువ 50శాతానికి పైగా పతనమైందన్నారు. ఇప్పుడది ఒక పెన్నీ విలువ కూడా చేయదని జోబిడన్ అన్నారు. రష్యాలోని పెద్ద బ్యాంకులన్నింటిని అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ నుంచి బహిష్కరించాం.. దీంతో ఇతర దేశాలతో వ్యాపారం చేసే సామర్థాన్ని రష్యా కోల్పోయింది' అని బైడెన్ శ్వేత సౌధంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జోబైడెన్ రష్యా నుంచి గ్యాస్ ముడిచమురు దిగుమతులపై నిషేధం విధిస్తున్నట్టు ప్రకటించారు. ఐరోపా మిత్రదేశాలు ఈ విషయంలో తమతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా లేవన్నారు. వాటి పరిస్థితులను తాము అర్థం చేసుకోగలమని పేర్కొన్నారు. ఉక్రెయిన్ కు అండగా ఉంటూ నిధులు అందిస్తామని బైడెన్ స్పష్టం చేశారు. ఆర్థిక భద్రత మానవతకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు జోబైడెన్ తెలిపారు. చమురు దిగుమతులపై నిషేధం విధించడం ద్వారా రష్యా ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వెల్లడించారు. రష్యాపై ఆంక్షలు విధించే విషయంలో ప్రపంచ దేశాలు ఏకతాటిపైకి రావడంతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు 'అంటరానిది'గా మారిందని బైడెన్ పాలకవర్గంలోని ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగం వాటా కలిగిన దాదాపు 30 దేశాలు ఇప్పుడు మాస్కోపై ఆంక్షలు విధించాయన్నారు. తమ నిర్ణయాలతో ఆర్థిక వ్యవస్థయే గాక రానున్న రోజుల్లో రష్యన్ సైనిక వ్యవస్థ సైతం బలహీనంగా మారుతుందన్నారు. ఆధునిక టెక్నాలజీ సెమీ కండకండక్టర్ల వంటి ఉత్పత్తులు కూడా రష్యాకు అందుబాటులో లేకుండా చేస్తామని బైడెన్ తెలిపారు. ఫలితంగానే రష్యన్ మిలటరీ బలహీనంగా మారుతోందన్నారు.

అమె రికా కంపెనీలన్నీ రష్యాలో మూసివేశారని.. రష్యా ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చడమే ధ్యేయమని జోబిడెన్ సంచలన ప్రకటన చేశారు.

# డిప్యూటేషన్ల పంచాయితీ




నిర్మల్ : జిల్లా పంచాయతీ శాఖలో పలువురు కార్యదర్శుల ఆకస్మిక బదిలీలు (డిప్యూటేషన్) వివాదాస్పదంగా మారాయి. నచ్చిన వారికి అనుకూలమైన చోట పోస్టింగ్‌లు ఇచ్చి నచ్చని వారికి స్థానచలనం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ వ్యవహారంలో ఓ అధికారి ఏకంగా పంచాయతీ కార్యదర్శితో వాట్సాప్ చాటింగ్ చేయడం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడం వీటికి మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. ఈ డిప్యూటేషన్లలో ఉన్నతాధికారి వద్ద పని చేస్తున్న ఉద్యోగి బంధువు సైతం ఉండటం, ఆయనకు జిల్లా కేంద్రానికి దగ్గరలో పోస్టింగ్ ఇవ్వడంతో చాలా కాలంగా బదిలీ కోసం ఎదురుచూస్తున్న తోటి కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టానుసారంగా కేటాయింపు

జిల్లాలో 468 పంచాయతీల్లో అన్ని పంచాయతీలకు కార్యదర్శులున్నారు. అందులో రెగ్యులర్ కార్యదర్శులు 112 మంది, జూనియర్ పంచాయతీ సెక్రటరీలు 324 మంది, అవుట్ సోర్సింగ్ కింద 32 మంది పని చేస్తున్నారు. వీరిలో చాలా మంది స్వస్థలాల నుంచి దూరప్రాంతాల్లో ఉన్న పంచాయతీలకు వెళ్లి పని చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో నివాసముంటున్న దాదాపు పది మంది పంచాయతీ కార్యదర్శులు రోజూ 50 కిలోమీటర్ల దూరంలోని గాదిగూడ మండలానికి వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా పలుమార్లు జిల్లా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకున్నారు. తమను దగ్గరి పంచాయతీల్లో సర్దుబాటు చేయాలని విన్నవించుకున్నారు. ఇప్పటికీ వారిలో ఏ ఒక్కరిని సర్దుబాటు చేయలేదు.

విధులొకచోట.. వేతనం మరోచోట

జిల్లాలో ప్రస్తుతం ఆరుగురు పంచాయతీ కార్యదర్శులను ఇలా డిప్యూటేషన్ పేరుతో బదిలీ చేశారు. అంటే వారు పాత పంచాయతీ నుంచే జీతభత్యాలు పొందాల్సి ఉంటుంది. పని మాత్రం వేరే చోట చేయాలి. ప్రతి పంచాయతీకి కార్యదర్శి ఉన్నపుడు ఇలా డిప్యూటేషన్ ఎందుకు చేస్తున్నారనే అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అధికారికంగా బదిలీ చేయాలంటే ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంటుంది. దీంతో అధికారికి నచ్చిన వారికి మాత్రం డిప్యూటేషన్ పేరుతో సర్దుబాటు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొందరు విజ్ఞప్తి చేసుకుంటేనే డిప్యూటేషన్ చేశామని అధికారులంటున్నారు. అయితే జిల్లాలో చాలామంది దూరప్రాంతాల్లో పని చేస్తున్న కార్యదర్శులు చాలామంది ఇలా దరఖాస్తు చేసుకున్నా వారిని ఎందుకు బదిలీ చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలోని గ్రామ పంచాయతీలో పని చేస్తున్న ఓ కార్యదర్శి తనకు పట్టణానికి ఆనుకుని మావల పంచాయతీకి పోస్టింగ్ ఇవ్వాలని అధికారితో చేసిన వాట్సాప్ చాటింగ్ సారాంశం ఇది..

కార్యదర్శి : గుడ్‌మార్నింగ్ సర్. సర్ ప్లీజ్ నాకు ఆదిలాబాద్ అయినా, మావల అయినా ట్రాన్స్‌ఫర్ చేయండి కద ప్లీజ్

అధికారి : ఓకే విల్ సీ

కా : థాంక్యూ సర్

ఎరోరోజు..కా : గుడ్ మార్నింగ్ సర్. నాకు ఏ జీపీ ఇస్తున్నారు సర్. నాకు మావల జీపీ ఇవ్వండి సర్ ప్లీజ్. ఇంకా లోపల జీపీలు వద్దు. సదరు కార్యదర్శి మావల జీపీ కోరితే జిల్లా కేంద్రానికి 10 కి.మీ. దూరంలోని మరో పంచాయతీకి డిప్యూటేషన్ ఇచ్చారు. అయితే కార్యదర్శి బదిలీ కోరితే డిప్యూటేషన్ ఇచ్చారు. "పాత చోటు నుంచి ఇల్లు ఖాళీ చేసి వచ్చాం. కొత్త పంచాయతీకి ఎవరైనా కార్యదర్శి బదిలీపై వస్తే నా పరిస్థితి ఏంటి సార్ మళ్లీ పాత స్థానానికి పోలేను కదా" అంటే ఆ అధికారి 'నో ప్రాబ్లెం.. జాయిన్ ఇమీడియట్లీ' అని బదులు ఇచ్చారు.

మచ్చుకు కొన్ని

గతంలో ఓ పంచాయతీ కార్యదర్శి మరో మండలానికి బదిలీ చేయాలని కోరుతూ ఏకంగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి నుంచి ఓ లేఖను తీసుకువచ్చారు. స్థానిక అధికారులు అదేమీ కుదరదని చెప్పేసి బదిలీని నిలిపివేశారు. మరో రాజకీయ నేత బంధువుకు మాత్రం నచ్చినచోట పోస్టింగ్ ఇచ్చి స్వామి భక్తిని చాటుకున్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలపై గళమెత్తే ఓ కార్యదర్శిపై కక్షగట్టిన అధికారులు ఆయన సక్రమంగా విధులు నిర్వహిస్తున్నా మెమోలు జారీ చేస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపణలున్నాయి.

ఓ పంచాయతీ కార్యదర్శికి ఏడాది వయసు పాప ఉంది. పాప సంరక్షణకు ఇబ్బంది అవుతుందని, దూర ప్రాంతానికి పంపవద్దని వేడుకున్నా అధికారులు కనికరించలేదు.

జిల్లా కేంద్రంలో నివాసముంటున్న ఓ పంచాయతీ కార్యదర్శి రోజూ 55 కిలోమీటర్ల దూరంలోని పంచాయతీకి వెళ్లి విధులు నిర్వహిస్తారు. దగ్గర పోస్టింగ్ ఇవ్వాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

పరిపాలనా సౌలభ్యం కోసమే..శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో ఆరుగురు పంచాయతీ కార్యదర్శులకు డిప్యూటేషన్ ఇచ్చాం. ఇందులో పనిష్‌మెంట్ ఏమీ లేదు. పాలనాధికారి ఉత్తర్వుల ప్రకారమే ప్రక్రియ అంతా జరుగుతోంది. పరిపాలనా సౌలభ్యం కోసం, కొందరు పరస్పర అంగీకారంతో ఆయా కార్యదర్శులకు డిప్యూటేషన్ ఇచ్చాం. ఇందులో ఎలాంటి పైరవీలు, సిఫారసులు లేవు.

# వ్యసనాల దారిలో.. యువతరం!



ఆదిలాబాద్ : ఉట్నూరుకు చెందిన 30 ఏళ్లలోపున్న ఆరుగురు యువకులు వేరే జిల్లాకు చెందిన మరో ఇద్దరు మిత్రులను తమ ఊరికి పిలిపించుకున్నారు. ఓ లాడ్జిలో గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డారు. సమాజంలో గుర్తింపు ఉన్న కుటుంబాలకు చెందిన వీరు చెడు వ్యసనాలకు బారిన పడి కేసుల పాలవ్వడం వారి తల్లిదండ్రులను బాధించింది. ఇటీవల ఉట్నూరు మండలం కుమ్మరితండా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం పాలయ్యారు. ప్రధాన కారణం ఓ యువకుడు స్పోర్ట్స్ బైక్‌ను తీసుకొని అతివేగంగా నడిపి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడమే. ఇలా ఉమ్మడి జిల్లాలో 70 శాతానికి పైగా యువత రహదారి ప్రమాదాల్లో బలైపోతున్నారు. నిర్మల్ జిల్లా తానూరు మండలం హంగిర్గాకు చెందిన మోహన్ అనే 25 ఏళ్ల యువకుడు పెళ్లి కావడంలేదని, సరైన ఉపాధి లేదని మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. తీవ్ర మానసిక ఒత్తిడిని భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా కొంతమంది ఎదుగుతున్న యువత తమ జీవితాలకు అర్ధాంతరంగానే ముగింపు పలుకుతున్నారు.

సమాజ అభివృద్ధి, దేశ పురోగతిలో యువత పాత్ర కీలకం. బలమే జీవనం.. బలహీనతే మరణమనే విషయాన్ని గుర్తుంచుకోవాలని స్వామి వివేకానంద యువతకు పిలుపునిచ్చారు.

కానీ ప్రస్తుతం వివిధ కారణాలతో ఉమ్మడి జిల్లాలోని యువతలో క్రమశిక్షణ లోపిస్తోంది. విపరీతమైన మనస్తత్వం, కోపం, ద్వేషం ఒత్తిళ్లకు లోనవుతూ ఆత్మన్యూనతతో బాధపడుతూ చెడు వ్యసనాల దారిలో పయనిస్తున్నారు. దీని ప్రభావం వారితో పాటు వారి కుటుంబాల పైనా పడుతోంది.

వీటి ప్రాధాన్యతను తెలియజెప్పాలి..

వ్యక్తిత్వ వికాస నిర్మాణంలో కుటుంబంతో పాటు విద్యాలయాల పాత్ర ఎక్కువే. తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరిస్తూ.. పిల్లలకు చిన్నప్పటి నుంచి పుస్తక పఠనం అలవాటు చేయాలి. గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలు, మానవత్వ విలువలు పెంచేలా వారిలో ఆసక్తిని కలిగించాలి. పాపభీతి, దైవభక్తి వంటి మంచి అలవాట్లను తొలుత పెద్దలు ఆచరించి ఆపై పిల్లల్లో పెంచాలి. ఇటువంటి ప్రాధాన్య అంశాలను వారు గుర్తించాల్సిన అవసరం ఉంది.

ఒత్తిడిని గుర్తించండి..చాలామంది యువత ప్రేమ విఫలమైందని, పోటీ పరీక్షల్లో ర్యాంకు రాలేదని, అడిగిన వస్తువు కొనివ్వడం లేదని, చిన్నచితకా ఆరోగ్య సమస్య వచ్చిందని ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిర్లక్ష్యం, సరిగా తినకపోవడం, ఎవరితోనూ మాట్లాడకపోవడం, ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడటం వంటి లక్షణాలు కనిపిస్తే.. వారికి వెంటనే మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇప్పించాలి.

ఈ జాగ్రత్తలు పాటిస్తే మేలు

మన అవసరాల కోసం వాహనం నడిపించడం తప్పుకాదు. అదే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, శిరస్త్రాణం ధరించడం, తాగకుండా నడిపించడం, సురక్షితంగా ఇంటికి వెళ్లేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

వీటికి దూరంగా ఉండండి..

యుక్త వయసు వచ్చాక శారీరక, మానసిక మార్పులు సహజం. ఈ సందర్భంలో మనసును నియంత్రణలో పెట్టుకొని ఉన్నతంగా చదవాలి అనే భావన కలిగి ఉండాలి. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

పఠనంతో ప్రయోజనం..

సెల్ రూపంలో అరచేతిలో సమస్త ప్రపంచం ఉన్న ప్రస్తుత సమాజంలో.. పక్కదారి పట్టించే విషయాల జోలికి వెళ్లకుండా దాని నుంచి మంచిని స్వీకరించండి. పుస్తకాలు, దిన, వార, పక్ష, మాసపత్రికలు పఠించడంతో మానసిక ప్రశాంతత పొందవచ్చు.

ఆరోగ్యంపై దృష్టి పెడితే..ప్రస్తుతం యువతలో శారీరక శ్రమ తగ్గిపోయింది. వ్యాయామం చేయడం, పరుగెత్తడం, యోగా సాధన వంటి అలవాట్లు లేకపోవడంతో చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం, లేదా యోగాను దినచర్యలో భాగం చేసుకోవాలి.

ఆటపాటలు

ఉరుకులు పరుగుల జనజీవన స్రవంతిలో యువత తీవ్రమైన ఒత్తిళ్లతో కాలం వెళ్లదీస్తున్నారు. దీంతో శారీరక శ్రమ తగ్గిపోయింది. బయటపడేందుకు ఇష్టమైన ఆటలు ఆడాలని, నచ్చిన సంగీతాన్ని వినాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిబంధనలు పాటిస్తేనే రక్షణ– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ ఆదిలాబాద్

మార్కెట్లో వస్తున్న కొత్త బైకులను ఇష్టానుసారంగా వేగంగా, నిబంధనలు అతిక్రమిస్తూ నడుపుతూ ప్రమాదాలకు గురై విలువైన ప్రాణాలను కోల్పోవద్దు. చెడు అలవాట్లకు గురై తమ జీవితాలను కటకటాల పాలు చేసుకోవద్దు. తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి.

చదువే అన్నింటికీ పరిష్కారం– వరుణ్‌రెడ్డి, ఐటీడీఏ పీఓ

యువత ఉద్యోగం, ఉపాధి లేదని ఆందోళన చెందవద్దు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు అందివస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. పోటీతత్వాన్ని పెంపొందించుకొని భవిష్యత్తులో ఎవరిపైన ఆధారపడకుండా తన కాళ్లపై నిలబడేందుకు సర్వశక్తిని దారపోయాలి. తల్లిదండ్రులకు భారం కాకుండా ఉన్న ఊరిలోనే ఉపాధిని ఆశించకుండా అవకాశం వస్తే ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడాలి. ప్రతి సమస్యకు చదువే పరిష్కారం చూపుతుంది.

# పేరుకుపోతున్నా.. పట్టింపు కరవు

ఆసిఫాబాద్: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీల పన్ను వసూలుదే కీలకపాత్ర. ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ప్రభుత్వ కార్యాలయాలు, క్వార్టర్లకు సంబంధించి.. ఏళ్ల తరబడి బకాయిలు ఉన్నా పట్టించుకోవడం లేదు. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారు. జిల్లాలోని 15 మండలాల పరిధిలోని 335 పంచాయతీల్లో ఏటా ఆస్తి పన్నులు వసూలు చేస్తారు. జిల్లాలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఇంటి పన్ను లక్ష్యం రూ.4.92 కోట్లు కాగా రూ.4.57 కోట్లు వసూలయ్యాయని, పన్నేతర లక్ష్యం రూ.2.12 కోట్లు కాగా రూ.1.87 కోట్లు వసూలైనట్లు జిల్లా పంచాయతీ అధికారులు చెబుతున్నారు. పన్ను, పన్నేతర కలిపి ఇంకా రూ.70 లక్షల వరకు బకాయి ఉన్నట్లు తెలుస్తుంది. నోటీసులతోనే సరిపెడుతున్నారు..లి ఇది వాంకిడి మండలం తహసీల్దార్ కార్యాలయం. దీనికి ఏడాదికి రూ.12,246 చొప్పున పన్ను వేశారు.



ఏటా చెల్లించకపోవడంతో బకాయిలు పెరిగి రూ.1.78 లక్షలకు చేరింది. వీటిపై నోటీసులు ఇవ్వడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

పొంతన లేని లెక్కలు..జిల్లా కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం, జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి తీసుకున్న లెక్కల్లో పొంతన లేకుండా ఉంది. 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆసిఫాబాద్ పంచాయతీ పన్ను లక్ష్యం రూ.1.64 కోట్లు, పన్నేతర రూ.91.13 లక్షలు కాగా వసూలు రూ.2.30 కోట్లు అయినట్లు డీపీవో కార్యాలయం అధికారులు చెబుతున్నారు. కానీ ఆసిఫాబాద్ పంచాయతీ నుంచి ఇచ్చిన సమాచారంలో మొత్తం లక్ష్యం రూ.1.03 కోట్లు కాగా వసూలు రూ.89.88 లక్షలు అయినట్లు అక్కడి అధికారులు చెప్పడం గమనార్హం.

ఏటికేడు పెరుగుతూ..జిల్లా కేంద్రంలో 16 ప్రభుత్వ కార్యాలయాలు, క్వార్టర్లకు సంబంధించి రూ.21.37 లక్షలు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. వారికి పంచాయతీ అధికారులు ఏటా నోటీసులు జారీ చేస్తున్నా ఎలాంటి స్పందన లేదు. వాటిలో అత్యధికంగా ఆర్డీవో కార్యాలయ భవనాలకు సంబంధించి రూ.3.93 లక్షలు, అటవీశాఖకు సంబంధించి రూ.3.98 లక్షలు, వట్టివాగు కార్యాలయ భవనాలు రూ.3.13 లక్షలు, పీఆర్ ఈఈ కార్యాలయ భవనాలు రూ.1.48 లక్షల చొప్పున పెండింగ్‌లో ఉన్నాయి.

రూ.లక్షలకు చేరినా నిర్లక్ష్యమే.. చిత్రంలో కనిపిస్తున్నది జిల్లా కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ భవనం. దీనికి ఏడాదికి రూ.27 వేల వంతున పన్ను వేశారు. కానీ ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో బకాయిలు రూ.2.22 లక్షలకు చేరాయి. వాంకిడి మండలంలో 14 ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాలకు సంబంధించి రూ.తొమ్మిది లక్షల బకాయిలున్నాయి. వాటిలో అత్యధికంగా తహసీల్దార్ కార్యాలయం రూ.1.78 లక్షల బకాయి ఉంది. ఆసుపత్రి క్వార్టర్లు, ఐకేపీ కార్యాలయం బకాయిలు సైతం రూ.లక్ష దాటి ఉన్నాయి. మిగతావి రూ.10 వేల నుంచి రూ.88 వేల వరకు పన్నులు పెండింగ్‌లో ఉన్నాయి. రెబ్బెనలో అయిదు ప్రభుత్వ కార్యాలయాలు రూ.1.17 లక్షల పన్ను బకాయి పడ్డాయి. ఇలా దాదాపు అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు ఆస్తిపన్ను బకాయిలున్నాయి.

వసూళ్లకు ప్రత్యేక కార్యాచరణ– రమేశ్, ఇన్‌ఛార్జి డీపీవో

కొన్ని ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలు పేరుకుపోతున్న విషయం వాస్తవమే. పెండింగ్‌లో ఉన్న కార్యాలయాలకు నోటీసులు జారీ చేసి వసూలు చేసేలా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.

అసలు రూ.25.16 లక్షలు వసూలైంది రూ.5 లక్షలే

జిల్లాలోని ఏకైక కాగజ్‌నగర్ పురపాలిక సంఘ పరిధిలోని 16 కార్యాలయాలకు గత ఆర్థిక సంవత్సరం పన్ను లక్ష్యం రూ.25.16 లక్షలు కాగా రూ.5 లక్షలే వసూలు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు పన్నుల చెల్లింపులో తీవ్ర జాప్యం చేస్తున్నా.. పుర అధికారులు మాత్రం కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకడుగు వేస్తున్నారు.

## జనం మేలెంచి.. జలం పనులు చేపట్టి..!

మంచిర్యాల : దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తి చేసుకుంటున్న క్రమంలో.. గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆజాదీ కా అమృత్ సరోవర్ పథకం' పనులు జిల్లాలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లాలోని వివిధ గ్రామాల్లో 75 చెరువులు, కుంటలను ఎంపికచేసి ఉపాధి హామీ పథకం నిధులను వెచ్చించి బలోపేతం చేసే పనులు చేస్తున్నారు. ఈ నెల 15 నాటికి నిర్దేశిత చెరువుల్లో పనులు పూర్తిచేసి ప్రజలకు ఉపయోగపడేలా చేయాలనే లక్ష్యంతో పనులు వేగంగా చేస్తున్నారు.

చెరువుల్లో చేసే పనులివే.. ప్రధానంగా చెరువుల్లోని అడుగు భాగంలో 10 వేల ఘనపు మీటర్ల మేరకు నీటిని నిల్వచేసేలా పనులు చేపట్టారు. ప్రమాణాల ప్రకారం చెరువుల్లో పేరుకుపోయిన ఒండ్రుమట్టిని పంట పొలాలకు తరలించి, కట్టలను బలోపేతం చేసేందుకు ఆ మట్టిని వినియోగిస్తారు. చెరువు కట్టలపై పెరిగిన ముళ్ల పొదలను తొలగించి, కట్టలను ఉపయోగించుకునేలా పనులు చేస్తారు. దీనికోసం కూలీలు నిత్యం పనులు చేసి ఎంపిక చేసిన చెరువులు, కుంటలను బలోపేతం చేస్తారు. దీనికోసం జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన చెరువులను గుర్తించి పనులు చేస్తున్నారు.

చక చకా తొలివిడత పనులు..

జిల్లాలో తొలి విడతగా చేపట్టిన 29 చెరువుల్లో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 15 నాటికి పనులు పూర్తిచేసి రైతులకు అనుకూలంగా మార్చేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. జాతీయ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు చెరువుల అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ పురోగతిని కేంద్ర ప్రభుత్వ సర్వర్‌కు అనుసంధానిస్తున్నారు. చెరువుల్లో మట్టిని తీసి, కట్టలను బలోపేతం చేయడం ద్వారా నీటి సామర్థ్యం పెరిగి చెరువుల దిగువన పంట పొలాల సాగు పెరుగుతుందనే లక్ష్యంతో పనులు చేస్తున్నారు. జిల్లాలోని 18 మండలాల్లో కనీసం ఒక చెరువునైనా ఆగస్టు 15 నాటికి పనులు పూర్తిచేసి అదే గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, సీనియర్ సిటిజన్, ఎన్నారై, స్వచ్ఛందసంస్థ ప్రతినిధులతో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

తుది దశకు చేరుకున్న పనులు– శేషాద్రి, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి, మంచిర్యాలజిల్లాలో ఆజాదీ కా అమృత్ సరోవర్ పథకం కింద గుర్తించిన చెరువుల్లో పనులు ముమ్మరంగా చేస్తున్నాం. ఆగస్టు 15 నాటికి 29 చెరువుల్లో పనులు పూర్తిచేయాలని నిర్ణయించుకున్నప్పటికీ వర్షాల కారణంగా 20 చెరువుల్లో పనులు పూర్తిచేసేలా క్షేత్రస్థాయిలో పనులు చేస్తున్నాం. పంద్రాగస్టు రోజున పనులు పూర్తయిన చెరువుల్లో ఆయా గ్రామాలకు చెందిన స్వాతంత్ర్య సమరయోధులు, సీనియర్ సిటిజన్లతో జెండా పండగ వేడుకలను నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించి పనులు వేగంగా చేస్తున్నాం.

## ఉపాధిలో.. ఉన్నతి..!

నల్గొండ: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం స్థానికంగా ఉన్నచోటనే పని కల్పించడమే కాకుండా నిరుద్యోగ యువతీ యువకులకు ఆయా రంగాల్లో తర్ఫీదునిచ్చి ఆర్థికంగా ఎదిగేలా అవకాశం కల్పించింది. ముఖ్యంగా 'ఉన్నతి' కార్యక్రమం పేరుతో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని యువతీ యువకులను ఎంపిక చేసి ఆయా రంగాల్లో ఎదిగేలా అవకాశం కల్పించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏటా ఎంపిక చేసిన కేంద్రాల్లో వేల సంఖ్యలో ఉన్నతి నైపుణ్య శిక్షణ సద్వినియోగ పరచుకుని ఎదుగుతున్న వారు ఉన్నారు. ఓ పక్క స్వగ్రామంలోనే పని మరోపక్క ఆసక్తి గలిగిన అంశాల్లో శిక్షణ సౌలభ్యం కల్పిస్తుండటం తమకు ఎంతగానో కలిసివస్తుందంటున్నారు. ముఖ్యంగా 2021-22 ఆర్థిక సంవత్సరంలో 41,083 కుటుంబాలు వందరోజుల పనిదినాలు పూర్తి చేసుకోగా, 2022-23లో 2,693 కుటుంబాలు, 2023-24 సంవత్సరంలో ఇప్పటి వరకు 354 కుటుంబాలున్నాయి.

కార్యక్రమ నిర్వహణ ఇలా..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న యువతీయువకులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమాలు 90 రోజులపాటు ఉంటాయి. ఉచిత భోజనం, వసతితోపాటు రోజుకు రూ.237 ఉపకార వేతనం కూడా అందిస్తుండటం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధిహామీ పథకంలో జాబ్‌కార్డు ఉండి వందరోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని వివాహం కానటువంటి నిరుద్యోగ యువతకు ప్రాధాన్యం ఇస్తారు. ఆసక్తి కలిగిన అంశాలపై ఎంపిక చేసిన కేంద్రాల్లో నిపుణుల ద్వారా ఉన్నతి కార్యక్రమం పేరుతో వివిధ రంగాల్లో రాణించేలా నైపుణ్య శిక్షణ ఉంటుంది. శిక్షణ అంశాలు ఇవీ..



పదోతరగతి, ఇంటర్, డిగ్రీ తదితర ఉన్నత విద్య పూర్తి చేసిన వారికి ఇందులో అవకాశం ఉంటుంది. స్కిల్డ్ విభాగంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ నైపుణ్యం, కంప్యూటర్ ఎంఎస్ ఆఫీస్, టైపింగ్, బేసిక్ ఇంగ్లిషు, కమ్యూనికేషన్ స్కిల్స్, నిరక్షరాస్యులకు అన్‌స్కిల్డ్ విభాగంలో వర్మీ కంపోస్టు తయారీ, పాడి, వ్యవసాయం, పుట్టగొడుగుల సాగు, టైలరింగ్, ప్లంబింగ్, క్యాండిల్స్ తయారీ, పాల ఉత్పత్తి పెంచుకునేందుకు ఆయా రకాల గడ్డిపెంపకం, పాల్‌సీలింగ్, కార్పెంటర్ తదితర రంగాల్లో నైపుణ్య శిక్షణ అందిస్తారు.

యువతకు ప్రోత్సాహం: నాగిరెడ్డి, డీఆర్‌డీవో, యాదాద్రి

ఉన్నతి నైపుణ్య శిక్షణ కార్యక్రమానికి వందరోజుల పని పూర్తి చేసిన కుటుంబాల్లోని యువత ఎక్కువ సంఖ్యలో ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం సదుద్దేశంతో రూపకల్పన చేసిన ఈ శిక్షణలో వారికి ముమ్ముందు ఆర్థికంగా మరింత ఎదగడానికి వృత్తిపరంగా రాణించడానికి అవకాశం ఉంటుంది. చదువుకున్న వారికి ఒకరకమైన రంగం, నిరక్షరాస్యులకు మరో రంగాల్లో తర్ఫీదు ఉన్నందువల్ల జీవితంలో స్థిరపడే ఆస్కారం ఉంటుంది.

## 'పేట'లో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పవర్‌పాయింట్

సూర్యాపేట : సూర్యాపేటలో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పవర్ పాయింట్ ఏర్పాటు కానుంది. హైటెక్ బస్టాండ్‌లో ఏర్పాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణలోని చెట్లను తొలగించి చదును చేస్తున్నారు. ఇప్పటికే 10 బస్సులు హైదరాబాద్- విజయవాడకు రాకపోకలు సాగిస్తున్నాయి. మొత్తం 56 బస్సులు నడిపేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వీటికి మధ్యలో ఛార్జింగ్ ఇబ్బందులు తలెత్తకుండా సూర్యాపేటలో వెసులుబాటు ఉంటుందని భావించి పనులు ప్రారంభించారు.

ఉమ్మడి జిల్లాలో రెండు

ఉమ్మడి నల్గొండలో జిల్లాలో రెండు ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పవర్ పాయింట్లు ఏర్పాటు కానున్నాయి. నల్గొండ, సూర్యాపేటలో ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. మొదటగా సూర్యాపేటలో పనుల ప్రారంభానికి సన్నాహాలు మొదలయ్యాయి. నల్గొండలో రెండోది ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ముడిచమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించేందుకు ఎలక్ట్రిక్ ఛార్జింగ్‌తో వాహనాలు నడిచేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల ఎలక్ట్రిక్ ఛార్జింగ్, హైడ్రోజన్‌తో వాహనాలు నడుస్తున్నాయి. దూరప్రాంతాలకు కూడా నడపాలనే యోచనలో అధికారులు ఉన్నారు. ఇందులో భాగంగానే హైదరాబాద్-విజయవాడ మార్గమైన సూర్యాపేటలో ఎలక్ట్రిక్ ఛార్జింగ్



పవర్ ఏర్పాటు చేస్తున్నారు.

ఛార్జింగ్ విధానం ఇలా..

బస్సుకు ఛార్జింగ్ నింపితే 500 కిలో మీటర్ల వరకు ప్రయాణిస్తుంది. ఫాస్ట్‌ఛార్జింగ్ 30 నిమిషాలు, స్లో ఛార్జింగ్ 5 నుంచి 6 గంటల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. విజయవాడ-హైదరాబాద్ మధ్య 300 కిలోమీటర్లపైగా దూరం ఉంటుంది. మధ్యలో ఎక్కడా ఛార్జింగ్‌కు ఇబ్బందులు తలెత్తకుండా సూర్యాపేటలో ఏర్పాటు చేస్తున్నారు. ఒకవేళ బస్సుల ఛార్జింగ్ అయిపోతే ఇక్కడే నింపుకొనేలా పాయింట్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు.

తగ్గనున్న కాలుష్యం

పెరుగుతున్న వాయు, శబ్ధ కాలుష్యంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. దీంతోపాటు వాతావరణంలో ఓజోన్ పొరకూడా దెబ్బతిని సమృద్ధిగా వర్షాలు కురిసే వీలుండదు. వాహనాల ద్వారా ఎక్కువగా కాలుష్యం వస్తుండటంతో వీటిని నివారించేందుకు ఎలక్ట్రిక్ ఛార్జింగ్‌తో వాహనాలు నడిచేలా ప్రయత్నాలు చేస్తున్నారు.

సుఖవంతమైన ప్రయాణం: సురేందర్, డీఎం ఆర్టీసీ, సూర్యాపేట

ఎలక్ట్రిక్ బస్సులో సుఖవంతమైన ప్రయాణం ఉంటుంది. వాహన శబ్ధం వినిపించదు. కాలుష్యం పూర్తిగా తగ్గుతుంది. భవిష్యత్తులో ఎక్కువగా వీటినే వినియోగించే అవకాశం ఉంది.

# హద్దులు తేల్చరు.. ఆక్రమణ ఆగదు!



కరీంనగర్ : జగిత్యాల జిల్లాలో 56,051 హెక్టార్లలో అటవీ భూమి ఉండగా జిల్లాలోనే అత్యధికంగా సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 12,789 హెక్టార్లలో ఉన్నాయి. రెవెన్యూ, అటవీ శాఖలు హద్దులు తేల్చకపోవడంతో అటవీ భూముల వివరాలు తేలడంలేదు. గతంలోనే అటవీ హక్కు చట్టం ద్వారా ఒక్క బీర్‌పూర్ మండలంలో 434.04 ఎకరాల అటవీ భూమిని 239 మంది గిరిజన, గిరిజనేతరులకు అందించారు. అదే అనువుగా భావించి అప్పటి నుంచి జిల్లాలో అటవీ భూముల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగింది. ఇటీవల పోడు భూములకు పట్టాలు అందిస్తుండడంతో నిబంధనలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా కేవలం 15 మందిని అర్హులుగా తేల్చారు. వారందరూ కేవలం 18.62 ఎకరాల విస్తీర్ణంలో ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 380 పంచాయతీలు ఉండగా ఇందులో 47 గ్రామాల నుంచి 4872 మంది 8557 ఎకరాలలో ఆక్రమణలో ఉన్నట్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1318 మంది గిరిజనులు 2630 ఎకరాలకు, గిరిజనేతరులు 3553 మంది 5926 ఎకరాలలో పోడు భూములు సాగు చేసుకున్నట్లు దరఖాస్తులు సమర్పించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు గ్రామసభలు నిర్వహించి కేవలం 15 మంది 18.62 ఎకరాల్లో మాత్రమే అర్హులుగా తేల్చడంతో మిగతా భూములపై ఎటూ తేల్చకపోవడంతో ఆక్రమణలోనే ఉన్నాయి.

ఏళ్లు గడుస్తున్నా..

అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో అటవీ భూముల ఆక్రమణ కొనసాగింది. బీర్‌పూర్ మండలంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం మండలంలోని నర్సింహుపల్లెలో 395, బీర్‌పూర్‌లో 995, కండ్లపల్లిలో 1444, మంగెళలో 1165, తాళ్లధర్మారంలో 1302, రేకులపల్లెలో 163, కొల్వాయిలో 596, రంగసాగర్‌లో 3425, మోతీనగర్‌లో 50, తుంగూర్‌లో 543, చర్లపల్లిలో 1954 ఎకరాల్లో అటవీ భూములు రికార్డుల పరంగా ఉన్నాయి. ఒక్క బీర్‌పూర్ మండలంలో 12,027 ఎకరాల్లో అటవీ భూమి, రెవెన్యూ రికార్డుల పరంగా ఉండగా ఇందులో 4120 ఎకరాల అటవీ భూమి కనపడడంలేనట్లు గతంలోనే నిర్వహించిన భూ ప్రక్షాళనలో తేలింది. బీర్‌పూర్ మండలంలో అత్యధికంగా ఆక్రమణకు గురికాగా ఇందులో చర్లపల్లి గ్రామంలో 1997.5 ఎకరాలు భూమి ఉండగా సర్వే నంబర్ 60లో 850 ఎకరాలు, తాళ్లధర్మారంలో సర్వేనంబర్ 4లో 1082 ఎకరాలు, తుంగూర్‌లో 360, 361 నంబర్లలో 305 ఎకరాలు, కమ్మునూర్‌లో 63 నంబర్‌లో 290.11 ఎకరాలు, నర్సింహులపల్లెలో 124 నంబర్‌లో 140 ఎకరాలు, కండ్లపల్లిలో 147లో 40 ఎకరాలు, బీర్‌పూర్‌లో 163లో 19, రేకులపల్లెలో 171లో 80 ఎకరాల భూములు వివాదాస్పదంగా ఉన్నట్లు గతంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఏళ్లు గడుస్తున్నా రెవెన్యూ, అటవీశాఖ సంయుక్తంగా సర్వే చేపట్టకపోవడంతో భూముల వివరాలు ఎటూ తేలక ఆక్రమణలో కొనసాగుతున్నాయి.

రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకెళ్లాం

అటవీ రెవెన్యూ భూముల హద్దులు ఏర్పాటు చేసేందుకు సంయుక్తంగా సర్వే చేపట్టాలని ఇప్పటికే పలుమార్లు రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకెళ్లాం. ప్రస్తుతం అటవీ భూములపై ప్రత్యేక నిఘా పెంచడమే కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతుంది. గతంలో ఆక్రమణలో ఉన్న భూముల సరిహద్దులు ఏర్పాటు చేస్తే స్వాధీనం చేసుకుంటాం. ఎవరైనా సాగుకు ప్రయత్నిస్తే వెంటనే కేసులు నమోదు చేస్తున్నాం. బీవీరావు, జిల్లా అటవీ అధికారి

గతంలో 434 ఎకరాలకు పట్టాలు

ప్రభుత్వం 2005లో గిరిజనులు, గిరిజనేతరులకు అటవీహక్కు చట్టం పథకం ద్వారా మండలంలో 434.04 ఎకరాల భూమిని 239 మందికి అందించారు. మండలంలోని తాళ్లధర్మారంలో 332.14 ఎకరాలు 166 మంది రైతులకు అందించారు. అయితే 4 సర్వే నంబరులో 1402 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండడంతో అదే సర్వే నంబరులో రెవెన్యూ పత్రాలను చూపుతూ వందల ఎకరాల్లో అటవీ భూమిని అక్రమంగా సాగు చేసుకుంటున్నారు. మంగెళలో 151 సర్వే నంబర్‌లో 60 మందికి 87.18 ఎకరాలు, తుంగూర్‌లో 497లో 13 మందికి 14.12 ఎకరాల అటవీ భూమిని గతంలో పంపిణీ చేశారు. చర్లపల్లి, తుంగూర్, కందెనకుంట, కమ్మునూర్, రంగసాగర్, కండ్లపల్లి ప్రాంతాలతోపాటు ప్రతి గ్రామంలో వందల ఎకరాల్లో అటవీ భూములు అక్రమంగా సాగు చేసుకుంటున్నా వాటి వివరాలను తేల్చడం లేదు.

## ఇంటర్ పుస్తకాల పంపిణీ ఎప్పుడు?



సిరిసిల్ల: పాఠ్యపుస్తకాలు ఉంటే బోధన సజావుగా సాగుతుంది. కళాశాలలు ప్రారంభమైన రోజునే విద్యార్థులకు పంపిణీ చేస్తే పాఠ్యాంశాలు సులభంగా అర్థమవుతాయి. దీని ప్రభావం ఫలితాలపైన చూపనుంది. ఇక ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు స్టేట్ సిలబస్ త్వరగా పూర్తయితే.. ఎంసెట్ లాంటి పైచదువుల పోటీ పరీక్షలకు సిద్ధమవడానికి సమయం కలిసివస్తుంది. జిల్లాలో 10 ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు.. 32 గురుకుల, ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ బోధన జరుగుతోంది. గురుకులాలు మినహా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయలో 1232, ప్రథమంలో 880 మంది వివిధ కోర్సుల్లో ఇప్పటికే ప్రవేశాలు పొందారు. వీరికి అవసరమైన పుస్తకాలను రాష్ట్ర ముద్రణాలయం నుంచి జిల్లాకు సరఫరా చేసేవారు. తర్వాత వాటిని కళాశాలల వారీగా పంపిణీ చేస్తారు.

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి ఎక్కువగా చుట్టుపక్కల మండలాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. ఈ ఏడాది ఇక్కడ ప్రథమ సంవత్సరంలో 131, ద్వితీయలో 223 మంది వివిధ కోర్సుల్లో చదువుతున్నారు. ఇంకా ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుండటంతో ప్రథమలో విద్యార్థులు పెరిగే అవకాశం ఉంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పుస్తకాలు లేకుండానే నెలరోజులుగా పాఠ్యాంశాల బోధన సాగుతోంది.

అందని ప్రభుత్వ పుస్తకాలు

ఈ ఏడాది నుంచి పాఠ్యపుస్తకాలతోపాటు నోటు పుస్తకాలు అందించాలని ఇంటర్ విద్యాశాఖ పలు సమీక్షల్లో చర్చించారు. ప్రభుత్వ పుస్తకాలు అందక.. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసే స్తోమతలేని చాలా మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది కూడా ఇంటర్ పాఠ్యపుస్తకాలు విద్యాసంవత్సరం మధ్యలో రావడంతో సిలబస్ పూర్తిచేయడంలో ప్రభావం చూపింది. దీని ప్రభావం వార్షిక ఫలితాలపై చూపనుంది. మొన్నటి ఫలితాల్లో ప్రథమ సంవత్సరం 57 శాతం, ద్వితీయ సంవత్సరం 69 శాతం ఉత్తీర్ణతలో నిలిచారు. ఈ ఏడాదైనా ఆ పరిస్థితి మారుతుందని.. తమకు ప్రభుత్వం పుస్తకాలు అందిస్తుందని ఆశించిన విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది.

ట్యాబ్‌లు పంపిణీ చేసినా..

పదోతరగతి ఫలితాల ఆధారంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ప్రవేశాలు పెరుగుతాయని అధ్యాపకులు ఆశించారు. కానీ ఈ విద్యాసంవత్సరం జిల్లా వ్యాప్తంగా 880 ప్రవేశాలు మాత్రమే జరిగాయి. జిల్లాలో గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు విస్తరించడంతో వీటి ప్రభావం ప్రభుత్వ జూనియర్ కళాశాలలపై తీవ్రంగా ఉంది. గతేడాది మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు కానుకగా ప్రభుత్వ పాఠశాలల్లోని ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యాబ్‌లను పంపిణీ చేశారు. వీటిలో ఇంటర్ తర్వాత వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే మెటీరియల్‌ను నిక్షిప్తం చేసి అందించారు. కళాశాలల్లో పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంటే వీటి బోధనతోపాటు ట్యాబ్‌లోని పాఠ్యాంశాలపై మరింత పట్టుపెరిగే అవకాశం ఉంది.

ఆర్థిక భారం

బహిరంగ మార్కెట్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం పాఠ్య, రాత పుస్తకాలు కలిపి రూ.3వేల వరకు ఉంటుంది. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ ఆలస్యాన్ని గుర్తించిన వ్యాపారులు అధిక ధర చెబుతున్నారని విద్యార్థులు పేర్కొంటున్నారు. నిరుపేద కుటుంబాల నుంచి వచ్చిన వారు వాటిని కొనుగోలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. కొందరు అధ్యాపకులు పూర్వ విద్యార్థుల నుంచి సేకరించి అందిస్తున్నారు. ఇలా అందరికీ సర్దలేక పోతున్నారు. కొనుగోలు చేద్దామన్నా మార్కెట్‌లో అన్నీ పాఠ్యాంశాలు అందుబాటులో లేవు.

నివేదిక పంపాంజిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు, ఆదర్శ, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నతాధికారులకు ఇండెంట్ పంపాం. ఈ ఏడాది సాధ్యమైనంత త్వరగా పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటాం. మోహన్, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి

## సర్కారు వారి చదువుల కోట..!

సూర్యాపేట : కోదాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 150 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్న రీతిలో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలలో ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో 15 సెక్షన్లు ఉన్నాయి. విశాల మైదానం ఉండటంతో క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు సైతం ప్రైవేటు పాఠశాలలను వదిలి ఇక్కడ చేరుతున్నారు. బాలుర ఉన్నత పాఠశాల అయినప్పటికీ బాలబాలికలు చేరుతుంటారు. కోదాడ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరంలో 150 మంది విద్యార్థులు కొత్తగా చేరారు. ఈ సందర్భంగా విద్యార్థులు శుక్రవారం వినూత్న రీతిలో ప్రదర్శన నిర్వహించారు. పాఠశాలలో ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో 15 సెక్షన్లు ఉన్నాయి. విశాల మైదానం ఉండటంతో క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు సైతం ప్రైవేటు పాఠశాలలను వదిలి ఇక్కడ చేరుతున్నారు. బాలుర ఉన్నత పాఠశాల అయినప్పటికీ బాలబాలికలు చేరుతుంటారు. ఇక్కడ ప్రైవేటుకు దీటుగా బోధన ఉంటుందని, పదో తరగతిలో 90శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

## హరితహారం లక్ష్యం ఖరారు

నిజామాబాద్ : వానాకాలం వచ్చేసింది. వర్షాలు మొదలు కావడంతో అధికారులు హరితహారంపై దృష్టి సారించారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఇప్పటికే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 28,09,000 మొక్కలు నాటేందుకు మండలాల వారీగా లక్ష్యం ఖరారు చేశారు.

ఇందుకు అవసరమైన మొక్కలను గ్రామీణాభివృద్ధి శాఖ ఇప్పటికే నర్సరీలో పెంచింది. ఆశాఖ ఆధ్వర్యంలో లక్ష్యం నిర్ణయించడంతో గ్రామాల్లో నాటడంపై దృష్టి సారిస్తున్నారు. డీఆర్‌డీవోతో పాటు అన్ని శాఖల అధికారులను భాగస్వాములు చేయనున్నారు. ఉపాధి హామీలో భాగంగా కూలీలతో పలు మండలాల్లో గుంతలు తీస్తున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు సమృద్ధిగా కురిస్తే మరింత వేగం పెంచనున్నారు.



స్థలాల గుర్తింపు

జిల్లాలో 530 పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో 5,300 మొక్కలు నాటాలని లక్ష్యం విధించారు. పంచాయతీ కార్యదర్శులతో పాటు ఉపాధి హామీ, ఇతర సిబ్బంది దీనిపైనే దృష్టి సారిస్తున్నారు. కొన్నిచోట్ల మొక్కలు నాటేందుకు స్థలాల గుర్తింపు పెద్ద సమస్యగా మారింది. ఇప్పటికే పంచాయతీ కార్యాలయ ఆవరణతో పాటు పాఠశాలలు, కళాశాలలను గుర్తించారు.

ఇంటికి ఆరు చొప్పున..

హరితహారంలో భాగంగా ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేయనున్నారు. గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులను ఇందులో భాగస్వాములు చేస్తున్నారు. రకారకాల పండ్లు, పువ్వుల మొక్కలు ఇవ్వనున్నారు. మొత్తం లక్ష్యం 28 లక్షలు ఉండగా అందులో ఇంట్లో మొక్కలు నాటే లక్ష్యం 12 లక్షలుగా నిర్ణయించారు.

ఆదేశాలు జారీ చేశాం- చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, నిజామాబాద్ వర్షాలు సమృద్ధిగా కురవగానే మొక్కలు నాటాలని ఆదేశాలు జారీ చేశాం. ఈసారి లక్ష్యం చేరుకుంటామనే నమ్మకం ఉంది. ప్రతి పంచాయతీలో గుంతలు సిద్ధం చేస్తున్నారు. అన్ని శాఖల వారు భాగస్వాములు కావాలి.

## మొర ఆలకించాలి

కామారెడ్డి : పురపాలికల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఐదేళ్ల కిందట సిటిజన్‌బడ్డీ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ప్రత్యేక యాప్ ద్వారా ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. జిల్లాలోని బల్దియాల్లో వందల సంఖ్యలో ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. పౌర సేవలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. గత పాలకవర్గ హయాంలో సిటిజన్ బడ్డీ యాప్‌ను రూపొందించారు. అందులో పురపాలికల చరిత్ర, అధికారుల చరవాణుల నంబర్లు, వార్డు అధికారుల వివరాలతో పాటు ఫిర్యాదుల స్వీకరణకు అవకాశం కల్పించారు. యాప్ ప్రారంభించిన మొదటి ఏడాది క్షేత్రస్థాయిలో వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించారు. ఆ తర్వాత ఏడాది నుంచి యాప్‌ను వీక్షించడమే మానేశారు. ప్రజలకు సులువుగా ఫిర్యాదు చేయడానికి గూగుల్‌ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌పై ఆశలు నీరుగారాయి. జిల్లాలోని బల్దియాల్లో 80 వార్డుల్లో రోజుకు 30-40 ఫిర్యాదులు రాగా అందులో కేవలం 10-15 మాత్రమే పరిష్కరిస్తున్నారు.

స్పందన కరవు

బడ్డీయాప్‌లో అందిన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామని మొదట్లో ప్రకటించినా ఆచరణలో అమలు కావడం లేదు. రోడ్లు, పారిశుద్ధ్యం, పైపులైన్ లీకేజీలు, అంతర్గత పైపులైన్ల మరమ్మతులు, శివారు కాలనీల్లో సమస్యలు అధికంగా ఉన్నాయి. ఈ



విషయంలో అధికారులు స్పందించాలని పుర జనం కోరుతున్నారు.

నిధులతో కూడుకున్న పనుల్లో జాప్యం

దేవేందర్, కమిషనర్-కామారెడ్డి బల్దియా

బల్దియాకు ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత విభాగాల అధికారులకు పరిష్కారం నిమిత్తం పంపుతున్నాం. నిధులతో కూడుకున్న పనులు చేపట్టడంలో కొంత జాప్యం జరుగుతోంది. ఇప్పటివరకు ఎన్ని సమస్యలు వచ్చాయో వాటన్నింటిని పరిష్కరించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తా. వార్డుల్లో అందిన వినతులపై వెంటనే స్పందించేలా చర్యలు చేపడతాం.

మురుగు నీరుతో ఇబ్బందులు

శ్రీనివాస్, అయ్యప్పనగర్‌వాన కురిస్తే పట్టణంలోని అయ్యప్పనగర్‌లోకి మురుగు నీరు వస్తుంది. ఇక్కడ కాల్వలు సక్రమంగా లేవు. ఏళ్లనాటి కాల్వల స్థానంలో కొత్తవి నిర్మించడం లేదు. పలుమార్లు బల్దియా సిబ్బందికి విన్నవించినా పట్టించుకోవడం లేదు. అధికారులు సమస్యలపై దృష్టి పెడితే బాగుంటుంది.

పశువుల బెడద పాండు, డెయిలీమార్కెట్

జిల్లాకేంద్రంలోని డెయిలీమార్కెట్‌లోకి పశువులు వస్తున్నాయి. ఇదివరకే పశువులు రైతులపై దాడి చేసి గాయపరిచాయి. మార్కెట్ నలువైపులా బారికేడ్లు పెట్టాలని అధికారులకు విన్నవించాం. ఇప్పటి వరకు అధికారులు మార్కెట్‌లో ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

## పైపైనే పూడికతీత.. నామమాత్రంగా మరమ్మతులు

కరీంనగర్ : వర్షాకాలం ప్రారంభమైంది.. ఏ సమయంలో భారీ వర్షం పడుతుందో తెలియదు. నాలాలు, వరద కాల్వల్లో పూడిక తీత పనులు మాత్రం పూర్తి కాలేదు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో 20 రోజుల కిందట ప్రారంభించిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. వరద కాల్వలు పొంగి పొర్లకుండా, చెత్త చెదారం లేకుండా పూడిక తొలగించాల్సి ఉండగా అధిక ప్రాంతాల్లో పూర్తి కాలేదు.

18 ప్రాంతాలు ఎంపిక

నగర పాలక సంస్థ పరిధిలో సుమారు 35 కిలోమీటర్ల పొడవునా వరద, మురుగునీటి కాల్వలు ఉన్నాయి. ముంపు ప్రాంతాలను పరిగణనలోకి తీసుకొచ్చి ఎక్కడైతే మట్టి, పూడిక ఉందో అక్కడనే తొలగించేందుకు 18 ప్రాంతాలను ఎంపిక చేశారు. మొత్తం 11.77 కి.మీ పొడవునా పూడిక, మట్టి తొలగించేందుకు రూ.67.79 లక్షలు



కేటాయించారు. ఒక్కో ప్రాంతంలో 180 మీటర్ల నుంచి మొదలుకొని 2500 మీటర్ల వరకే ఉండటంతో ఆయా ప్రాంతాల్లో వరద కాల్వలు పూర్తి స్థాయిలో పూడిక తొలగించే అవకాశాలు కనిపించడంలేదు.

కొంతమేర శుభ్రం

వరద కాల్వల్లో భారీ స్థాయిలో మట్టి, పూడిక నిండి ఉంటుండగా అధికారులు మాత్రం పైపైనే పనులు చేయిస్తున్నారు. పూర్తి స్థాయిలో తొలగించాలంటే క్యూబిక్ మీటర్ చొప్పున పెద్ద ఎత్తున నిధులు చెల్లించాల్సి ఉండటంతో కొంతమేరకు పరిమితమయ్యారు. మంకమ్మ తోట రెండో ఠాణా పక్కన ఉన్న కాల్వలో పూడిక తీసిన కొద్దీ బయటకు వస్తోంది. ఇక్కడ రోడ్డుపై వంతెన ఉండటంతో అందులో నుంచి చెత్తా చెదారం తొలగించలేదు. మురుగు ప్రవహించకుండా అలాగే నిలిచి ఉంటుంది.

పలు చోట్ల శిథిలం

కాల్వలు పలు చోట్ల కూలిపోగా కనీసం మరమ్మతులు చేయడం లేదు. గోడలు కూలిపోవడం, పక్కన ఉన్న భాగం పడిపోవడంతో వరదతో గండి పడేలా తయారైంది. సాయినగర్, శనివారం అంగడి బజారు, హుస్సేనీపుర, శర్మనగర్, గాంధీ రోడ్డు ప్రాంతాల్లో శిథిలమయ్యాయి. కొన్ని చోట్ల చెట్లు పడిపోయి ఉన్నాయి.

## సాగు వ్యయం.. వ్యవసాయం భారం

కరీంనగర్ : : సాగు వ్యయం ఏటేటా పెరుగుతుండడంతో వ్యవసాయం భారంగా మారుతోంది. యంత్రాల అద్దె, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి. గతేడాదితో పోల్చితే ఈ ఏడాది ఎకరా వరిసాగుకు రూ.వెయ్యి వరకు అదనంగా వెచ్చించాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తుండగా రూ.కోట్లలో భారం పడుతోంది. ప్రస్తుత వానాకాలంలో వ్యవసాయ పనులు ఊపందుకుంటున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.40 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అధికారుల అంచనా. పెట్టుబడి వ్యయం అమాంతం పెరిగిపోవడంతో రైతులు ఆర్థికంగా కుదేలవుతున్నారు.

1.62 లక్షల ఎకరాల్లో వరి

జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 1,62,036 ఎకరాల్లో వరిపంట సాగు కానున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. 1,347 ఎకరాల్లో మొక్కజొన్న, 74,492 ఎకరాల్లో పత్తి, 3 ఎకరాల్లో మినుము, 97 ఎకరాల్లో పెసర, 1756 ఎకరాల్లో కంది, 330 ఎకరాల్లో ఇతర పంటలను సాగుచేయనున్నారు. దుక్కులు సిద్ధం చేసిన రైతులు పత్తి, మొక్కజొన్న, కంది పంటల విత్తనాలను విత్తుకున్నారు. వరిసాగులో నాట్లు వేసే ప్రక్రియ క్రమంగా ఊపందుకుంటోంది. గతేడాదితో పోల్చితే డీజిల్, ట్రాక్టర్ అద్దె, విత్తనాలు, కూలీరేట్లు, పురుగు మందుల ధరలు పెరిగాయి. ఎకరా వరిసాగుకు కనీసం రూ.వెయ్యి వరకు పెట్టుబడి ఖర్చులు పెరిగినా జిల్లాలో వరి రైతులపై సుమారు రూ. 16 కోట్ల అదనపు భారం పడుతోంది.

ధరల పెరుగుదలతో కుదేలు

డీజిల్ ధరలు అడ్డూఅదుపు లేకుండా పెరుగుతుండడంతో ట్రాక్టర్ అద్దె ఖర్చులను యజమానులు పెంచుతున్నారు. రెండేళ్ల క్రితం నాటు వేసేందుకు ఎకరా పొలాన్ని దమ్ము చేస్తే రూ.5,500 నుంచి రూ.6 వేల వరకు తీసుకునేవారు. ఈ సంవత్సరం ట్రాక్టర్ అద్దె ఖర్చు రూ.7,500 వసూలు చేస్తున్నారు. నాట్లు వేసేందుకు కూలీల కొరత నెలకొంది. బిహార్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చే వలస కూలీలను వినియోగిస్తున్నారు. ఎకరా విస్తీర్ణంలో పొలం నాటువేసేందుకు కూలీలు రూ.5,000 వేలు అడుగుతున్నారు. ఒక మగ కూలీకి రోజుకు రూ.900 చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. వరి విత్తనాలు, కలుపు నివారణకు చల్లే రసాయన మందు ధరలను ఆయా కంపెనీలు అమాంతం పెంచేశాయి. కూలీలు, ఇతర ఖర్చుల పెరుగుదలతో హలధారులు ఆర్థికంగా కుదేలవుతున్నారు. ఎకరా విస్తీర్ణంలో నాటు వేసే క్రతువు పూర్తయ్యే వరకు గతంలో రూ.10 వేల ఖర్చు వచ్చేదని, ఈ సంవత్సరం రూ.12 వేల నుంచి రూ.14 వేలు వెచ్చించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. నాట్లు వేసిన తర్వాత కలుపుతీత, ఎరువుల వాడకం, పురుగు మందుల పిచికారి, వరికోత, ధాన్యాన్ని మార్కెట్‌కు తరలింపు తదితర పనులకు ఖర్చులు అదనం. ఎకరా పొలంలో వరిసాగు చేయడానికి దమ్ము మొదలుకొని ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళ్లి శుద్ధిచేసే వరకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. మధ్యలో అకాల వర్షాలు, తెగుళ్లు సోకితే పెట్టుబడి ఖర్చులు సైతం చేతికందక, నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.

కౌలు రైతు దయనీయ పరిస్థితిధరల పెరుగుదలతో వారిపై పెనుభారం పడుతోంది. వరిసాగు మినహా పత్తి, ఇతర ఆరుతడి పంటల సాగు కోసం ఒకసాలు తీయడానికి గతంలో రూ.800 వరకు ఖర్చుకాగా ఇప్పుడు రూ.1,200 ఖర్చు వస్తోంది. గంటకు రూ.650 ఉన్న ప్లౌ (రెండు నాగళ్లు) వ్యయం రూ.వెయ్యికి పెరిగింది. రోటవేటర్ యంత్రాన్ని తిప్పితే గతంలో గంటకు రూ.1,800 ధర ఉండగా ప్రస్తుతం రూ.2 వేలకు పైగా చేరింది. పెట్రోలు, డీజిల్ ధరలు అమాంతం పెరగడంతో పెట్టుబడికి అదనంగా వ్యయం చేయాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయంలో అన్ని ధరల పెరుగుదలతో కౌలు రైతులు పరిస్థితి మరింత దయనీయంగా మారింది.

# మళ్లీ మోగిన ఏసీడీ మోత




ఖమ్మం :విద్యుత్తు సంస్థ వినియోగదారులకు వేసవి షాక్‌ను గట్టిగానే ఇచ్చింది. జూన్ నెలలో జారీ చేసిన బిల్లుల్లో 'అదనపు వినియోగ ధరావతు(ఏసీడీ)' పేరిట రూ.వేలల్లో ఛార్జీలు వేయడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రతినెలా వచ్చే బిల్లుతోపాటు, అదనంగా వీటిని చేర్చారు. ఏసీడీ అంటే ఏమిటి, ఇది ఎందుకు వేశారో తెలియక వారు ఆందోళనకు గురవుతున్నారు. జనవరిలోనూ వినియోగదారులపై ఏసీడీని ప్రయోగించి, ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవడంతో విద్యుత్తు సంస్థ విరమించుకుంది.

రూ.వేలల్లో బిల్లులు

నెలవారీ వాడకానికి రూ.వందల్లో బిల్లు వస్తే ఏసీడీ డ్యూ రూ.వందల నుంచి రూ.వేలల్లో వచ్చాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా వక్రమార్గంలో తమ నుంచి అదనపు వసూళ్లు చేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో సర్వీసులు...

జిల్లాలో మొత్తం 6.1 లక్షల విద్యుత్తు సర్వీసులున్నాయి. వీటిలో వ్యవసాయ కనెక్షన్లు 1.05 లక్షలు పోను బిల్లింగ్ చేయాల్సినవి 5.05 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. అయితే గ్రామీణ ప్రాంతాల్లో రెండు నెలలకు ఒకసారి, పట్టణ ప్రాంతాల్లో నెలనెలా బిల్లింగ్ చేస్తారు. దీంతో ప్రతినెల సుమారు 3.9 లక్షల సర్వీసులకు బిల్లింగ్ చేయాల్సి ఉంది. ఈనెల తీసిన బిల్లుల్లో అధిక శాతం సర్వీసులకు ఏసీడీ డ్యూ పేరిట అదనపు బిల్లులు వచ్చాయి.

ఏసీడీ అంటే...గత ఏడాది కాలంలో వినియోగదారుడు వాడుకున్న సరాసరి యూనిట్లను లెక్కించి రెండు నెలల బిల్లును డిపాజిట్గా అంటే అదనపు వినియోగ ధరావతు(అడిషనల్ కంజప్షన్ డిపాజిట్-ఏసీడీ) జూన్ బిల్లులో చూపించారు. దీన్ని విద్యుత్తు నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) రెగ్యులేషన్ నెం.6-2004(సంవత్సరం) ప్రకారం విధించారు. వినియోగదారుడు తాను సర్వీసు తీసుకునే సమయంలో ఒక కిలో వాట్ సామర్థ్యానికి రూ.200 చొప్పున సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డీ) చెల్లించాడు. తదుపరి వారు వాడుకునే యూనిట్ల ప్రకారం ఏసీడీని లెక్కిస్తారు. దీనిలో నుంచి ఎస్‌డీ మినహాయించి నికర మొత్తాన్ని వారి బిల్లుల్లో ఏసీడీగా చూపిస్తారు. ఈ డిపాజిట్పై ఏడాదికి ఒకసారి రిజర్వు బ్యాంకు నిర్ణయించిన రేట్ల ప్రకారం వడ్డీ లెక్కించి వడ్డీని వినియోగదారుడి బిల్లులో జమ చేస్తారు. ఈ డిపాజిట్ను సర్వీసు రద్దు చేసుకున్నప్పుడు తిరిగి చెల్లిస్తారు.

జిల్లాలో రూ.9.92 కోట్ల అదనపు భారం...

జిల్లాలో ఈనెల గృహ వినియోగదారులు 11,580 మందికి రూ.3.58 కోట్లు, వ్యాపార సంస్థలు, పరిశ్రమలు వంటి ఇతర వినియోగదారులు 15,342 మందికి రూ.6.34 కోట్లు ఏసీడీ ఛార్జీలు వేశారు. అంటే మొత్తం 26,922 మంది వినియోగదారులపై రూ.9.92 కోట్ల భారం మోపారు. అంటే గృహ వినియోగదారులపై సరాసరి రూ.3,091, ఇతర వినియోగదారులపై సరాసరి రూ.4,132 అదనపు ఛార్జీలు వడ్డించారు. వీరిలో ఇప్పటి వరకు గృహ వినియోగదారులు 1,151 మంది రూ.31.32 లక్షలు, ఇతరులు 1,390 మంది రూ.39.56 లక్షలు చెల్లించారని అధికారులు తెలిపారు.

ఎవరు చెల్లించాలి..పట్టణ ప్రాంతాల్లో అనేక మంది వినియోగదారులు అద్దెకు ఉంటున్నారు. మరి రూ.వేలల్లో నమోదైన ఏసీడీ బకాయి ఎవరు చెల్లించాలనే సమస్య తలెత్తుతోంది. దీనిపై వివాదాలు చెలరేగుతున్నాయి. గృహ యజమానులే దీన్ని చెల్లించాలని అధికారులు చెబుతున్నారు.

వేసవి ప్రభావం

ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు అసాధారణంగా ఉన్నాయి. నివాసాలు, వ్యాపార సంస్థల్లో కూలర్లు, ఏసీల వినియోగం భారీగా పెరిగింది. దీంతో ఏడాది సరాసరి వినియోగం కూడా అదే స్థాయిలో పెరిగింది. దీనివల్ల వినియోగదారు కనెక్షన్ తీసుకున్న సమయంలో చెల్లించిన సామర్థ్యం కన్నా ఎక్కువ వినియోగించినట్లవడంతో ధరావతు వసూలు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.వినియోగదారుడు గత ఏడాది కాలంలో వాడుకున్న అదనపు విద్యుత్తుకు డిపాజిట్గా ఏసీడీ వసూలు చేస్తున్నాం. ఇది వారి పేరిట డిపాజిట్గా ఉంటుంది. సర్వీసు రద్దు చేసుకుంటే తిరిగి చెల్లిస్తాం. ఎ.సురేందర్, ఎస్ఈ

# అవార్డుల దవాఖానా




ఖమ్మం : భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి నాణ్యమైన వైద్యసేవలు అందిస్తూ రోగుల పాలిట వరంగా మారింది. ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంత వాసులతో పాటు భద్రాద్రి మన్యం వాసులు దీనిపై ఆధారపడ్డారు. వైద్య విధాన పరిషత్‌లో 200 పడకలు గల ఏరియా ఆసుపత్రి రాష్ట్రంలో ఇదొక్కటే కావడం విశేషం. పేరుకు 200 మంచాలని ఉన్నా 250 పడకలు అందుబాటులో ఉండడం దీని ప్రత్యేకత. కొన్నేళ్లుగా కాయకల్ప, ఎన్‌క్వాస్ పురస్కారాలు వరిస్తున్నాయి. మరోసారి ఎన్‌క్వాస్ బృందం రానుందని సూపరింటెండెంట్ డా.రామకృష్ణ, ఆర్ఎంఓ డా.రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.నవజాత శిశు చికిత్స కేంద్రంలో 20 మంచాలున్నాయి. నెలలోపు పసిబిడ్డలకు నిపుణులు వైద్యమందించే వార్డు. అత్యవసర పరిస్థితుల్లో ఇతర ఆసుపత్రులకు రిఫరల్ చేయకుండా ఇటీవల ఎలక్ట్రానిక్ సేవలను అమల్లోకి తెచ్చారు. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి అనుసంధానం చేశారు. ఇ-చికిత్స విధానంలో కంప్యూటర్ మానిటర్ సాయంతో ఇక్కడి పరిస్థితిని అక్కడి నిపుణులు పరిశీలిస్తారు. ఆన్‌లైన్ ద్వారా తగిన సలహాలతో ఇక్కడి వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. ఈ వార్డుకు నేషనల్ నియోనేటాలజీ ఫోరం నుంచి 2021 డిసెంబరులో అక్రిడిటేషన్ లభించింది. ఈ ఏడాది డిసెంబర్ వరకు అమలులో ఉంటుంది. 2021-22లో ఉత్తమ సేవల పురస్కారాన్ని ప్రభుత్వం అందించింది. పిల్లల వార్డులో 40 పడకలున్నాయి. ఏడాది నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు సేవలు అందించేందుకు ప్రత్యేక విభాగాలు కొలువుదీరాయి. ఇటీవల ముస్కాన్ పథకం కింద ప్రశంస పత్రం దక్కింది. ఇది మూడేళ్లపాటు అమల్లో ఉండటంతో నగదు ప్రోత్సాహకాలు అందుతాయి.

కాన్పుల వార్డులో 40 పడకలున్నాయి. ఇటీవల లక్ష్య పథకానికి ఈ వార్డు ఎంపికైంది. మూడేళ్ల పాటు నగదు ప్రోత్సాహకాలతో పాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం లభించినట్టే. సాధారణ కాన్పుల్లో ప్రతిభ చాటినందుకు 2018లో పురస్కారం వరించింది.

పది మంచాలు గల ఐసీయూ అపర సంజీవనిగా మారింది. ఇది హైదరాబాద్‌లోని నిమ్స్‌కు అనుసంధానం కావడంతో అవసరమైనప్పుడు ఇ-చికిత్సలు అందుతున్నాయి.

సిబ్బందిని సర్దుబాటు చేస్తే..

అన్ని విభాగాలకు కలిపి 70 మంది వైద్యులు అవసరం. ప్రస్తుతం 28 మంది పనిచేస్తున్నారు. ఐదుగురు మానేశారు. గైనకాలజిస్టులు ఆరుగురికి ఇద్దరే ఉండటంతో కాన్పుల సంఖ్య నెలకు 200 కంటే తగ్గింది. నర్సింగ్ సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్యసేవల్లో రాజీపడటం లేదు. దీని అవసరాన్ని గుర్తించి జిల్లా ఆసుపత్రిగా మారిస్తే గిరిజన ప్రాంతంలో అన్ని వర్గాల వారికి నిపుణుల సేవలు అందుతాయి. కొత్తగూడెంలో జిల్లా ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల వచ్చింది. కొంతమంది సిబ్బంది కళాశాలలో విధులు నిర్వర్తిస్తూ ఆసుపత్రికి రావటం లేదు. అలాంటి వారిని ఏరియా ఆసుపత్రికి బదిలీ లేదా సర్దుబాటు చేస్తే మన్యం దవాఖానాకు మహర్దశ వచ్చినట్లే.

# రైతు వేదిక నిధలు అందక..!




కొత్తగూడెం : వ్యవసాయశాఖ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించింది. సాగులో సలహాలు, సూచనలు వీటి ద్వారా అధికారులు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రైతు వేదికల నిర్వహణపై ఉన్నతాధికారులకు పట్టింపు లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలలు తరబడి రైతు వేదికల నిర్వహణ భారంగా మారుతోందని ఏఈఓలు వాపోతున్నారు.

ఉభయ జిల్లాల్లో..ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 196 రైతు వేదికలు ఉన్నాయి. వీటి నిర్వహణ బకాయిలు రూ.1,76,40,000 పేరుకుపోయాయి. ఒక్కో రైతు వేదికకు ప్రతినెల రూ.9వేలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి 2022 ఆగస్టు వరకు ఐదు నెలలకు ఒక్కో రైతు వేదికకు రూ.45 వేలు అందించింది. ఆ తరువాత నుంచి గడిచిన పది నెలల నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. ఒక్కో రైతు వేదికకు రూ.90వేల బకాయిలు పేరుకుపోయాయి. అన్నదాతలకు శిక్షణ, ప్రజోపయోగ కార్యక్రమాలు రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) అందుబాటులో ఉంటారు. అన్నదాతలకు వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు అందిస్తారు. అవగాహన సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల సమయంలో కూర్చునేందుకు కుర్చీలు, మైక్‌సెట్ లాంటి సామగ్రిని ప్రభుత్వం సమకూర్చించింది. ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలు, వివిధ శాఖల సమావేశాలకు వీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది.

రైతు వేదికల నిర్వహణకు పది నెలలుగా నిధులు మంజూరు కావటం లేదు. ఈ అంశమై పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరైన వెంటనే బకాయిలు చెల్లిస్తాం. అభిమన్యుడు, డీఏఓ, భద్రాద్రి కొత్తగూడెం

## అందరికీ అవగాహన.. ప్రమాదాల నియంత్రణ

గోదావరిఖని: బొగ్గు గనుల్లో ప్రమాదాల నివారణకు యాజమాన్యం అనేక చర్యలు తీసుకుంటున్నా ఆగడం లేదు. సాంకేతికపరమైన రక్షణ చర్యలు చేపడుతున్నా చిన్న చిన్న కారణాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. రక్షణ చర్యలపై అవగాహన లేకపోవడం, వాటిని పాటించడంలో క్రమశిక్షణ లోపించడమే కారణమని సింగరేణి గుర్తించింది. ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు జులై 1 నుంచి 31 వరకు ప్రతి ఉపరితల గని, భూగర్భ గనితో పాటు వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ప్రతి డివిజన్‌కు చెందిన ఏరియా రక్షణ అధికారి.. గనులు, విభాగాల అధికారులను సమన్వయ పరుస్తూ కార్మికులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టింది. దీనికి పిట్ రక్షణ కమిటీ సభ్యులను కూడా భాగస్వాములను చేయాలని భావిస్తోంది.

2023-24లో 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని సింగరేణి లక్ష్యంగా నిర్దేశించింది. ప్రమాద రహిత ఉత్పత్తి లక్ష్యంగా కొత్తగా 'నా రక్షణ నా బాధ్యత' నినాదంతో ప్రణాళిక రూపొందించింది. ప్రమాదాల వల్ల కార్మికులతో పాటు వారి కుటుంబాలకు కూడా నష్టం జరిగే



అవకాశం ఉండటంతో రక్షణపై వారికి కూడా అవగాహన కలిగించాలని భావిస్తోంది. ఈ మేరకు కార్యక్రమాలకు సంబంధించిన నివేదికలను ప్రతి వారం కార్పొరేట్‌కు పంపించాలని ఆదేశించింది. నెల రోజుల అనంతరం పూర్తి నివేదికలను ఆగస్టు 8 వరకు పంపించాలని సూచించింది.

నా రక్షణ.. కుటుంబానికి భరోసా

ప్రతి కార్మికుడిలో 'నేను రక్షణతో పని చేస్తేనే నా కుటుంబానికి రక్షణగా ఉంటుంద'న్న అభిప్రాయాన్ని కల్పించనుంది. పని స్థలాల్లో రక్షణ చర్యలు పటిష్టంగా అమలు చేయాలని యాజమాన్యం ఆదేశించింది. వాటిపై కార్మికులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించింది. గనులపై ఏరియా కమిటీతో పాటు మైన్ కమిటీలు విడతల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాయి. ఆ సమయంలో ఏబీసీడీ(ఎ-అటిట్యూడ్, బి-బిహేవియర్, సి-కల్చర్, డి-డిసిప్లిన్) అంశాలపై కార్మికులకు వివరిస్తారు. దీంతో వారిలో మార్పు రావడంతో పాటు ప్రమాదాలు పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందని యాజమాన్యం భావిస్తోంది.

అందరి భాగస్వామ్యం

ప్రమాదాల నివారణకు చేపట్టిన కార్యక్రమంలో సంస్థలోని ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయనున్నారు. గని మేనేజర్, ఏజెంటు, ఏరియా రక్షణ అధికారి, విభాగాల అధిపతులు, పిట్ రక్షణ కమిటీల ఆధ్వర్యంలో ప్రచారం చేయనున్నారు. ప్రతి విభాగంలో రక్షణ చర్యలు, చట్టాలపై అవగాహన కల్పిస్తారు. దీనిపై విస్తృతంగా ప్రచారం చేసేందుకు విధుల ప్రారంభ సమయంతో పాటు మధ్యలో విశ్రాంతి సమయంలో కూడా కార్మికుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. కింది నుంచి పైస్థాయి అధికారి వరకు అందరూ భాగస్వాములైన ప్రమాదాలు నివారించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

## వర్గ రాజకీయాలే అసలు సమస్య

నల్గొండ: రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ వాతావరణంతో.. కాంగ్రెస్ పార్టీ ఉత్సాహంగా ఉండగా.. ఉమ్మడి జిల్లాలో మాత్రం సీనియర్ నాయకులంతా ఎవరికి వారు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని క్యాడర్ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని పన్నెండింటిలో సగం కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పార్టీ నేతల మధ్య వర్గ భేదాలు పార్టీ బలోపేతానికి అడ్డుకట్ట వేస్తున్నాయి. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఇటీవల 20 రోజులు సాగిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో దేవరకొండ, నకిరేకల్, సూర్యాపేట నియోజకవర్గాల్లో బహిరంగంగానే నాయకులు గొడవపడటం పరిస్థితికి అద్దం పడుతోంది. ఉమ్మడి జిల్లాలోని పలువురు కీలక నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతారనే ప్రచారం జరుగుతున్నా...వారిని పార్టీలో చేర్చుకోవడానికి జిల్లాకు చెందిన సీనియర్ నేతలు ఆసక్తి చూపడం లేదని సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. పైగా ఆలేరు, నకిరేకల్, నల్గొండ, మునుగోడు, తుంగతుర్తి, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో పార్టీ బాధ్యులు లేకపోవడంతో.. ఎవరికి వారు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

విభేదాలతో ఎవరికి వారే..

భువనగిరి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి, ఆ జిల్లా డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్‌రావు ఠాక్రేకు ఇటీవలే కొందరు భువనగిరి పట్టణానికి చెందిన నేతలు వినతి పత్రం ఇచ్చారు. తొలి విడతలో జరిగిన భట్టి పాదయాత్రలో ఆలేరు నియోజకవర్గ పార్టీ నాయకుడు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో బహిరంగంగానే గొడవ పడ్డారు.దేవరకొండలో మాజీ ఎమ్మెల్యే బాలునాయక్‌తో పాటూ టిక్కెట్ ఆశిస్తున్న బిల్యానాయక్, కిషన్‌నాయక్, రవినాయక్ పార్టీ కార్యక్రమాలను వేరేర్వుగా నిర్వహిస్తున్నారు. ఇటీవల భట్టి పాదయాత్రలో నిత్యం ఇక్కడ గొడవలు జరగడంతో ఒక దశలో భట్టి అసహనానికి గురికావడం గమనార్హం.దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన పాదయాత్రకు హాజరైన కోమటిరెడ్డి, సొంత నియోజకవర్గమైన నల్గొండలో హాజరుకాకపోవడంతో పార్టీ శ్రేణుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది.

నకిరేకల్, సూర్యాపేట నియోజకవర్గాల్లో వర్గ విభేదాలు ఇప్పటికే తారస్థాయిలో ఉండగా...రానున్న కాలంలో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంటుండటంతో పరిస్థితి ఏంటనే ఆందోళన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.మిర్యాలగూడలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పురపాలిక పార్టీ ఫ్లోర్ లీడర్ లక్ష్మారెడ్డి మధ్య ఇప్పటికే విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి.మునుగోడు ఉప ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ ఆశించి భంగపడిన కృష్ణారెడ్డి ప్రస్తుతం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తుండగా.. తిరిగి పార్టీలోకి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వస్తారన్న ప్రచారంతో పార్టీ కార్యక్రమాల నిర్వహణలో పురోగతి ఉండటం లేదు.

ఖమ్మం జనగర్జనకు సమాయత్తం

జులై 2న.. ఖమ్మంలో నిర్వహించబోయే పార్టీ జనగర్జన సభకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగా జనాన్ని తరలించాలని టీపీసీసీ జిల్లాలోని సీనియర్ నేతలను ఆదేశించినట్లు తెలిసింది. దీంతో సరిహద్దుల్లోని కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేటతో పాటూ నల్గొండ, నకిరేకల్, భువనగిరి నుంచి జనాన్ని తరలించేందుకు ఆయా నియోజకవర్గ నేతలు సమాయత్తమవుతున్నారు. పార్టీ శ్రేణులు హాజరై రాహుల్‌గాంధీ సభను విజయవంతం చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షులు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇప్పటికే శ్రేణులకు విజ్ఞప్తి చేస్తున్నారు. హీనపక్షం ఉమ్మడి జిల్లా నుంచి 30 వేల మంది వరకు తరలించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. 'రాహుల్ సభను విజయవంతం చేసేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా నుంచి ప్రత్యేకంగా నల్గొండ పార్లమెంటు నుంచి భారీ ఎత్తున ప్రజలు ఖమ్మం సభకు స్వచ్ఛందంగా వెళ్తారని' ఎంపీ ఉత్తమ్‌కు వెల్లడించారు.

## భళా.. విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ : నిత్యం వినియోగించే పరికరాలతో గడ్డికోసే యంత్రాన్ని అతి తక్కువ ఖర్చుతో తయారు చేసి భళా అనిపించు కున్నారు ఈ చిన్నారులు. చదివేది తొమ్మిదో తరగతే అయినా.. తమలోని ఆలోచనకు బీజం వేసి దానిని ఆచరణలోకి తీసుకొచ్చారు జిల్లా కేంద్రానికి చెందిన వశిష్ఠ ఇంపల్స్ ఉన్నత పాఠశాలలో చదివే ఇద్దరు పిల్లలు. పాడైపోయిన వస్తువులను సేకరించి, విద్యాలయం వైర్మన్ గొల్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, సహ ప్రధానోపాధ్యాయులు రవి, రమేశ్, ఉపాధ్యాయుల మార్గదర్శనంతో యంత్రాన్ని రూపొందించి శెభాష్ అనిపించుకున్నారు ఆదిత్య, ఇమ్రాన్. మార్కెట్లో లభించే ప్రత్యేక గడ్డి కోత యంత్రాలకు రూ. 3- 5వేలకు పైగా ధర ఉంటోంది. కేవలం



రూ. 250తో గ్రాస్ కట్టింగ్ మిషన్‌ను రూపొందించారు ఆ చిన్నారులు.
తయారీ ఇలా.. వాడిపారేసిన పీవీసీ పైపులను ఉపయోగించారు. నాలుగు చిన్న బ్యాటరీలు, ఒక మోటారు, స్విచ్ ఏర్పాటు చేశారు. థర్మకోల్, కటర్ బ్లేడులను మోటారుకు గ్లూ ద్వారా బిగించారు. కరెంటు తీగను పైపు మధ్యలో నుంచి పైవరకు తీసుకెళ్లారు. అక్కడ బ్యాటరీలు స్విచ్‌కు బిగించారు. మంచి ఆకారంలోకి తీసుకొచ్చి గడ్డి కోసే యంత్రాన్ని తయారు చేశారు.

## పరిఢవిల్లుతున్న వ్యవసాయ అనుబంధ రంగాలు

ఎల్లారెడ్డిపేట: ఎటు చూసినా బీడు భూములు... ఉపాధి హామీ పనుల్లో అన్నదాతల కుటుంబాలు... ఇవీ ఐదేళ్ల క్రితం నాటి దుర్భిక్ష పరిస్థితులు. కానీ నేడు అందుకు పూర్తిగా భిన్నం. జలసిరుల జిల్లాగా మారిపోయింది. నీటి వనరులు నిండుకుండలను తలపిస్తుండగా పచ్చని పంట పొలాలతో అలరారుతోంది. వ్యవసాయానికి మంచి రోజులు రాగా అనుబంధ పరిశ్రమలూ పరిఢవిల్లుతున్నాయి. రైతు కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడగా ఇంకా అనుబంధంపై ఆధారపడిన అనేక మంది పేదలకు ఉపాధి లభిస్తుంది. మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక పురోభివృద్ధి సాధిస్తున్నాయి.

జిల్లా భౌగోళిక విస్తీర్ణం 4,72,328 ఎకరాలు కాగా 2,03,380 ఎకరాల భూములు సాగుకు అనుకూలంగా ఉన్నాయి. 1,19,706 మంది రైతు కుటుంబాలకు వ్యవసాయమే జీవనాధారమైంది. సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో నాలుగైదేళ్లుగా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ వస్తోంది. పంటల యాజమాన్య పద్ధతులతో ఆశించిన స్థాయిలో మంచి దిగుబడులను సాధిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోలు బంకులో ఈ వానాకాలం సీజన్ పంటల సాగుకు పూర్తయ్యే వరకు రోజుకు 4 వేల లీటర్ల డీజిల్, 1600 లీటర్ల పెట్రోలు అమ్మకాలు జరిగాయి. సీజన్ లేని సమయంలో రోజుకు వెయ్యి లీటర్ల డీజిల్, 1200 లీటర్ల పెట్రోలు విక్రయాలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. ఐదేళ్ల క్రితం ఇదే బంకులో రోజుకు కనీసం 800 లీటర్ల డీజిల్, 600 లీటర్ల పెట్రోలు కూడా అమ్ముడుపోయేది కాదని పేర్కొన్నారు. గతంతో పోల్చితే పంటల సాగు రెండు రెట్లు అధికమైంది. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు సైతం ముందుకు దూసుకెళుతున్నాయి. చిన్న తరహా పరిశ్రమలు ఊపందుకోగా అనేక కుటుంబాలకు చేతినిండా పని లభిస్తోంది. వరి విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లతో అన్ని వ్యాపార దుకాణాల్లో హడావుడి కనిపిస్తోంది. పొలాల్లోనూ ట్రాక్టర్లు క్షణం తీరికలేకుండా పనిచేస్తున్నాయి. వ్యవసాయ ఆధారిత వృత్తుల పరిశ్రమల్లో పని చేసే కార్మికులకు ఉపాధి లభిస్తోంది. సాగుతో ముడిపడి ఉన్న అన్ని దుకాణాలు వ్యాపారంతో కళకళలాడుతున్నాయి. వ్యవసాయాధారితమైన లేత్ మిషన్, వైండింగ్, ఎలక్ట్రికల్స్, వెల్డింగ్ దుకాణాల నిర్వాహకులు, బైక్, ట్రాక్టర్, కార్ మరమ్మతు దారులకు చేతినిండా పని దొరుకుతోంది. వాటిలో పని చేసే వారికీ వేతనాలు పెరిగాయి. జిల్లాలో భారీ, మధ్య, చిన్న తరహా పరిశ్రమల ద్వారా ఎంతో మంది లబ్ధి పొందుతున్నారు.

పరికరాల తయారీతో ఉపాధి–శ్రీనివాస్, వెల్డింగ్‌షాపు నిర్వాహకుడు, రాచర్ల గొల్లపల్లి

ఆంధ్ర ప్రాంతం నుంచి 10 సంవత్సరాల క్రితం వలసవచ్చి రాచర్ల గొల్లపల్లిలో వెల్డింగ్ దుకాణం నిర్వహిస్తున్నాను. ట్రాక్టర్ పరికరాలైన కల్టివేటర్‌లు, కేజ్‌వీల్స్ తయారీ చేస్తున్నాను. అయిదేళ్ల క్రితం కరవు వల్ల పని కోసం నిరీక్షించేవాడినని, ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెబుతున్నారు. అయితే మెటీరియల్ ధరలు పెరగడం వల్ల రైతులు నూతన వ్యవసాయ పనిముట్ల జోలికి వెళ్లడం లేదని, పాత వాటినే మరమ్మతులు చేయించుకుని వాడుతున్నారు. ఇప్పుడు గ్రామాల్లోనూ వెల్డింగ్‌షాపులను పెట్టుకొని ఉపాధి పొందుతున్నారు.

మోటార్ల మరమ్మతులకు గిరాకీ–లింగమూర్తి, లేత్ మిషన్ నిర్వాహకుడు, వీర్నపల్లివీర్నపల్లిలో ఆరేళ్లుగా లేత్ మిషన్ వర్క్, మోటారు వైండింగ్ పనులు నిర్వహిస్తున్నాను. గతంలో కరవు ప్రభావంతో గిరాకీ లేక అద్దె చెల్లించడం కూడా కష్టంగా ఉండేది. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వచ్చింది. ఇప్పుడు చేతినిండా పని దొరుకుతుంది. మెటీరియల్ ధరలు పెరగడం కొంత ఇబ్బందిగా ఉంది.

కొత్త ట్రాక్టర్ల కొనుగోళ్లు పెరిగాయి–ఎల్లారెడ్డి, ఆటోమొబైల్ షాపు యజమాని, రాచర్ల గొల్లపల్లికరవు కాలంలో పాత ట్రాక్టర్లతోనే రైతులు నెట్టుకొచ్చే వారు. సమృద్ధిగా సాగునీరు ఉండటం, పుష్కలంగా పంట సాగుతో రైతులు నూతన ట్రాక్టర్లను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. గతంలో గ్రామంలో రెండు మూడు మాత్రమే ట్రాక్టర్లు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి మారింది. ఇంటికి ఒక ట్రాక్టర్ అందుబాటులో ఉంటోంది. అయితే ఆటోమొబైల్ దుకాణాల్లో వాహన విడి భాగాలతోపాటు వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన సామగ్రి అమ్మకాలు పెరిగాయి.

# మత్తులో విద్యార్థి చిత్తు..



నిర్మల్ : రాష్ట్రంలో మాదకద్రవ్యాలు, మత్తుపదార్థాల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి కేసీఆర్ కొద్దినెలల క్రితం ప్రకటించారు. దీంతో జిల్లా పరిధిలో పోలీసు, ఆబ్కారీ అధికారులు స్థానికంగా ఉండే రెవెన్యూ, మున్సిపల్ సహకారంతో విస్తృత తనిఖీలు చేపట్టారు. నియంత్రణకు కృషి చేశారు. కొద్దిరోజులు ఆర్భాటంగా ఈ తతంగం కొనసాగినా, ఆ తర్వాత నెమ్మదించింది. క్రమేపీ నిలిచిపోయింది. ఫలితంగా పరిస్థితి మొదటికొచ్చి జిల్లాపరిధిలో మత్తు పదార్థాల వినియోగం పెచ్చుమీరిపోతోంది. తాజాగా చోటుచేసుకుంటున్న ఘటనలు దీనికి నిదర్శనం.

'హద్దు'లు దాటుతూ..

జిల్లాకు పొరుగునే మహారాష్ట్ర ఉండటం, సరిహద్దు ప్రాంతాల్లో పెద్దగా తనిఖీలు, నిఘా లేకపోవడంతోనే యథేచ్ఛగా మత్తుపదార్థాల రవాణా సాగుతోంది. బాసర, తానూరు, కుభీరు, కుంటాల, సారంగాపూర్ తదితర మండలాల్లో పలు గ్రామాల్లో మహారాష్ట్రతో సరిహద్దును కలిగి ఉన్నాయి. భైంసా నుంచి భోకర్ వెళ్లే ప్రధాన రహదారిపై మినహా మరెక్కడా పెద్దగా తనిఖీ కేంద్రాల్లేవు. ఈ కారణంగానే అటువైపు నుంచి జిల్లాకు సులభంగా మత్తుపదార్థాలు చేరవేసేందుకు సౌలభ్యం ఏర్పడింది. ఏదైనా పక్కా సమాచారం వచ్చినపుడో, తనిఖీల్లో పట్టుబడినపుడో మినహా మిగతా సమయంలో పోలీసులు, ఆబ్కారీ అధికారులు పెద్దగా సోదాలు చేసిన దాఖలాలు కనిపించకపోవడం అక్రమ దందాకు ఊతమిచ్చినట్లవుతోంది.

వరుస ఘటనలు..

తాజాగా బాసరలోని ఆర్జీయూకేటీలో ఇద్దరు విద్యార్థులు గంజాయి తాగుతూ పట్టుబడటం గమనార్హం. ఇతర విద్యార్థులకు అనుమానం రావడంతో అధికారులకు సమాచారం అందించారు. నాందేడ్ నుంచి గంజాయి సరఫరా అయి ఉంటుందని ప్రాథమిక విచారణలో స్పష్టమవడం పరిస్థితికి అద్దం పడుతోంది. కొద్దిరోజుల క్రితం ముథోల్ ప్రాంతంలోని ఓ ప్రభుత్వ వసతిగృహంలో పలువురు విద్యార్థులు హుక్కా తాగుతున్నట్లు బయటపడింది. వసతిగృహంలో హుక్కా పరికరం పట్టుబడటంతో దాన్ని స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థులకు అవగాహన కల్పించిన అధికారులు ఆ తర్వాత చేతులు దులుపుకొన్నారు. జరిగిన సంఘటనకు ధ్యులెవరనే విషయమై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గమనార్హం. ఎక్కడ్నుంచి ఇవి సరఫరా అయ్యాయి, ఎవరు తీసుకొచ్చారనే అంశానికీ తగిన ప్రాధాన్యత నివ్వలేదని, ఫలితంగా ఈ అంశం మరుగున పడినట్లయ్యిందని స్థానికులు పేర్కొంటున్నారు.

అలవాటుపడి..

ఒకరిని చూసి మరొకరు మత్తుకు అలవాటుపడుతున్నారు. ముఖ్యంగా విద్యాసంస్థల్లో ఈ పోకడ కొనసాగుతుండటం శోచనీయం. సామాజిక మాధ్యమ వినియోగం పెరిగింది. సమాచార మార్పిడి సులభమైంది. దీనికి తోడు వసతిగృహాలు, విద్యాలయాల్లో పర్యవేక్షణ నామమాత్రమైంది. ఈ కారణంగానే సులభంగా వ్యసనానికి బానిసవుతున్నారు. ఈ క్రమంలో చదువును, తమ భవిష్యత్తును చేజేతులా దెబ్బతీసుకుంటున్నారు.

చర్యల్లేకనే..

మత్తు పదార్థాల నియంత్రణకు మొదట్లో అధికారులు కఠినంగా వ్యవహరించారు. ఎక్కడికక్కడ తనిఖీలు విస్తృతంగా చేపట్టారు. పట్టుబడ్డవారిపై కేసులు నమోదుచేశారు. పీడీ యాక్టు నమోదుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఇదంతా కొద్దిరోజులే.. ఆ తర్వాత నెమ్మదించారు. అవగాహన చర్యలను పట్టించుకోవడం లేదు. ఫలితంగా పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చాయి. ఇష్టారీతిన గంజాయి, హుక్కా వంటి మత్తుపదార్థాల వినియోగం పెరిగిపోయింది.

# ఇక కార్డులేకున్నా ఆరోగ్యశ్రీ సేవలు



నిర్మల్ : తెల్లరేషన్ కార్డుగానీ, ఆరోగ్యశ్రీ కార్డుగానీ కలిగి ఉన్న వారికే ఇది వరకు కార్పొరేట్ ఆసుపత్రి సేవలు అందుబాటులో ఉండేవి. తాజాగా ఆహార భద్రత కార్డులు కలిగిన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ సేవలను వర్తింపజేస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులతో ఉమ్మడి జిల్లాలోని పేదలకు అందుబాటులోని లేని ఖరీదైన వైద్యం చేరువ కానుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి పేదలకు ఏ పెద్ద జబ్బు వచ్చినా.. మరే చికిత్స చేసుకున్నా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా పొందేలా ఆరోగ్యశ్రీ సేవలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఆరోగ్యశ్రీ సేవలు వర్తించేలా చర్యలు తీసుకున్నారు. ఇందుకోసం చికిత్సకు రూ. 5 లక్షల వరకు ప్రభుత్వమే భరించేలా ఆ పథకాన్ని అమలు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కూడా ఆరోగ్యశ్రీ సేవలు యథాతదంగా అమలవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుల స్థానంలో ఆహార భద్రత కార్డులను జారీచేసింది. గతంలో తెల్లరేషన్‌కార్డు లేని వారందరికీ ఆహార భద్రత కార్డులను పంపిణీ చేసింది. కొత్తగా ఆహార భద్రత కార్డులు పొందిన వారికి ఆరోగ్యశ్రీ సేవలు పొందేందుకు పలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేది. ఆ సేవలు పొందాలంటే తహసీల్దారు, లేదంటే పాలనాధికారి కార్యాలయానికి వెళ్లి అనుమతి పత్రం తీసుకోవాల్సిన పరిస్థితి. దీంతో పేదలు ఎన్నో అగచాట్లు పడ్డారు. ఇపుడా పరిస్థితిని దూరం చేస్తూ ఆరోగ్యశ్రీసేవలను ఆహారభద్రత కార్డులకు వర్తింపజేయడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వేలాది మంది పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది.

1,660 రకాల చికిత్సలు

డా. వినీత్, ఉమ్మడి జిల్లా సమన్వయకర్త, ఆరోగ్యశ్రీ విభాగం

గతంలో తెల్లరేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు ఉంటేనే ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండేవి. ఇపుడు ఆహార భద్రత కార్డుదారులు సైతం ఆయుష్మాన్ భారత్ – ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. తెలంగాణలోనే కాదు మహారాష్ట్రలోనూ ఆయుష్మాన్ భారత్ కింద ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చు. ఆరోగ్యశ్రీ కింద 1,660 రకాల చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఏదైనా ఆసుపత్రికి వెళ్లినపుడు ఆహార భద్రతకార్డు తీసుకెళ్తే చాలు సేవలు వినియోగించుకోవచ్చు.

# చరవాణి భద్రం

ఖమ్మం : 5 నెలల క్రితం ఖమ్మంలో ఓ దొంగను పోలీసులు అరెస్టు చేసి పదికిపైగా చరవాణిలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో సమాచారం ఆధారంగా బాధితులకు అప్పగించారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వచ్చిన బస్సులో ఎవరో ప్రయాణికుడు మరిచిపోయిన విలువైన చరవాణి, ఇతర గుర్తింపు కార్డులను ఖమ్మం ఆర్టీసీ అధికారులు చూసి డిపోలో భద్రపరిచారు. కార్డుల ఆధారంగా బాధితుడికి సమాచారం ఇచ్చి చరవాణి, ఇతర వస్తువులను అప్పగించారు. అదృష్టవశాత్తు సంస్థ ఉద్యోగులు చూడటంతో తన చేతికి వచ్చింది. రద్దీసమయంలో తస్కరణకు గురైన ఎన్నో ఫోన్ల ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. దైనందిన జీవితంలో చరవాణి ఓ భాగమైంది. నేటి సాంకేతిక యుగంలో అది లేకుండా ఇంటి నుంచి బయటకు రావడం ఊహించలేనంతగా మారిపోయింది. సమాచార విప్లవంలో కనీస అవసరమైపోయింది. కొత్తకొత్త ఫీచర్‌లు సొంతం చేసుకున్న స్మార్ట్‌ఫోన్‌ల కోసం జనం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వాటిని ప్రాణప్రదంగాను చూసుకుంటున్నారు. అందులోనే సమస్త సమాచారం నిక్షిప్తం చేసుకుంటున్నారు. కానీ దురదృష్టవశాత్తు, ఏమరుపాటులో వాటిని పోగొట్టుకుని బాధపడుతున్నారు. మరికొందరి ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. కొందరు పోగొట్టుకున్న, తస్కసరణకు గురైన తమ ఫోన్లను తిరిగి పొందేందుకు ప్రయాస పడుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులకు ఫిర్యాదు చేయడం, జాగ్రత్తలపై కథనం.

పోయినవి 300.. ఛేదించినవి 89

సైబర్ ల్యాబ్ ఏర్పాటు చేసినప్పటి నుంచి ఖమ్మం కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు మొత్తం 300 ఫోన్లు పోగొట్టుకున్నట్లు బాధితుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. అనధికారికంగా పోలీస్‌స్టేషన్‌కు చేరని సంఘటనలు ఇంకా చాలానే ఉంటాయి. అందులో చోరీకి గురైనవి, తమ అజాగ్రత్త వల్ల పోయినవి ఉన్నాయి. సైబర్ విభాగం ఎంతో సమయం వెచ్చించి ఇప్పటివరకు 89 చరవాణులను గుర్తించి వాటిని బాధితులకు అందించారు. పోలీసు శాఖలోని సాంకేతిక విభాగం, సర్వీసు ప్రొవైడర్లు సమన్వయంతో నెలల తరబడి వెచ్చిస్తేగాని చోరీకి గురైన ఫోన్ల ఆచూకీ గుర్తించడం కష్టమని పోలీసులు చెబుతున్నారు.

మీ సేవలోనూ ఫిర్యాదు చేయొచ్చు

పోలీసు కమిషనరేట్ పరిధిలో సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నా ఫిర్యాదులను స్వీకరించేందుకు కొన్ని పోలీసు స్టేషన్లు విముఖత చూపుతున్నట్లు తెలిసింది. దీంతో బాధితులు మీసేవ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశాన్ని పోలీసు శాఖ కల్పించింది. అలా చేసినప్పటికీ చరవాణి గురించి స్టేషన్లలో ఆరా తీసేందుకు వెళితే సరైన సమాధానం చెప్పడం లేదు. సైబర్‌సెల్‌కు పంపించాం. గుర్తించినప్పుడు ఇస్తాం అనే నిర్లక్ష్య సమాధానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

స్వీయ జాగ్రత్తలే ప్రధానం..ఖరీదైన చరవాణిలను చోరీ చేసి సొమ్ము చేసుకోవడం అలవాటుగా మారిన కొందరు దొంగలు బస్టాండు, రైల్వేస్టేషన్, దుకాణాలు, ఆటో స్టాండ్ల వద్ద యథేచ్ఛగా తిరుగుతున్నారు. ప్రయాణికులు గుంపులుగా ఉన్నపుడు, రద్దీ ప్రాంతాల్లో తమ నైపుణ్యం ప్రదర్శిస్తున్నారు. ఎలాంటి ఫోన్ అయినా ఫర్వాలేదనట్లు చోరాహుషార్ చూపిస్తున్నారు. ప్రజలు విలువైన సెల్‌ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిని పోగొట్టుకుంటే తిరిగి పొందడం కష్టమైన పని అని చెబుతున్నారు పోలీసులు.

ఎక్కడో కొట్టేసి.. అమ్మకాలు

సెల్‌ఫోన్ చోరీకి గురైనా, పోగొట్టుకున్నా కనిపెట్టడం పోలీసులకూ కష్టంగా మారింది. ఆ ఫోన్‌లో వెంటనే సిమ్‌కార్డు వేస్తే గుర్తించే అవకాశం ఉంది. అలా కాకుండా సిమ్‌కార్డు తీసేసి ఫోన్ స్విచ్ఛాఫ్ చేస్తున్నారు. ఐఎంఈఐ నంబరును బట్టి పోలీసులు శోధించినా ఫలితం ఉండటం లేదు. ఫోన్ దొంగల చేతికి వచ్చిన వెంటనే సిమ్ తీసేసి సుమారు 4 నెలల వరకు స్విచ్ఛాఫ్‌గానే ఉంచుతున్నారు. ఇలా దోచుకున్న ఫోన్లను చిల్లరదొంగలు బయట తెలిసిన వారికి రూ. 2 వేల నుంచి రూ. 5వేల వరకు తీసుకొని అంటగడుతున్నారు. అది ఎంత ఖరీదైనా ఫోను అయినప్పటికీ ఇలా చేస్తున్నారు.

## ఊరికి దూరం.. క్రీడా ప్రాంగణాలు

గంగాధర : ఈ చిత్రంలో ఆటోలు నిలిపి ఉంచిన స్థలం మధురానగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలది. దీనిపక్కనే జూనియర్ కళాశాల మైదానం ఉండగా విద్యార్థులు, చుట్టు పక్కలకు చెందిన చిన్నారులు ఆటలు ఆడుకుంటున్నారు. దీనిపక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇటీవల తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇక్కడ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయలేదు. వ్యాయామానికి సింగిల్‌బార్, డబుల్ బారు కూడా వేయలేదు. పనులు పూర్తయినట్లు చూపించారు. గంగాధర మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, వ్యాయామం చేసేందుకు ఇతర పరికరాలు గతంలోనే ఏర్పాటు చేశారు. రాత్రిపూట ఆటలు ఆడుకునేందుకు, క్రీడల్లో శిక్షణకు కూడా ఇక్కడ దీపాల వెలుగులు ఏర్పాటు చేశారు. స్థానికంగా ప్రభుత్వ స్థలం లేదని ఇక్కడే ఇటీవల గ్రామీణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి మమ అనిపించారు. ఇంతదానికి ఇక్కడ క్రీడా ప్రాంగణం ఎందుకు ఏర్పాటు చేశారనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ రెండుచోట్లే కాదు చాలా గ్రామాల్లోనూ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో ఊరికి దూరంగా, పాఠశాలల మైదానాలనే క్రీడాప్రాంగణాలుగా ఏర్పాటు చేసి కాగితాల్లో పూర్తయినట్లు చూపించారు. పిల్లల్లో మానసిక, వ్యక్తిత్వ వికాసానికి, చరవాణుల నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు ఒక్కోచోట రూ. 4 లక్షలు కేటాయించింది. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ కోర్టులతోపాటు వ్యాయామానికి సింగిల్ బార్, డబుల్ బార్ స్టాండ్లు ఏర్పాటు చేయాలని సూచించింది. గంగాధర మండలంలో 33 గ్రామ పంచాయతీలతోపాటు మరో అయిదు ఆవాస గ్రామాల్లోనూ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే గంగాధర, మధురానగర్, కురిక్యాల, గట్టుబూత్కూర్, ఒద్యారం, ఆచంపల్లి, ర్యాలపల్లి, బూర్గుపల్లి, సర్వారెడ్డిపల్లి, కొండాయపల్లి, నాగిరెడ్డిపూర్, గర్శకుర్తి, రంగారావుపల్లి గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు పూర్తి చేశారు. ఉప్పరమల్యాల, కాచిరెడ్డిపల్లి, చర్లపల్లి ఎన్, చర్లపల్లి ఆర్, మంగపేట, న్యాలకొండపల్లి, కాసారం, చిన్నఆచంపల్లి, మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో ప్రగతిలో ఉన్నాయి. లక్ష్మీదేవిపల్లి, వెంకటాయపల్లి, నారాయణపూర్, ముప్పిడిపల్లి, నర్సింహులపల్లి, లింగంపల్లి, వెంకంపల్లి, కొండన్నపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామ పంచాయతీలతోపాటు ఆవాస గ్రామాలు పత్తికుంటపల్లి, బొమ్మకంటిపల్లి మద్దిగడ్డ, పానుగంటిపల్లి గ్రామాల్లో ప్రభుత్వ స్థలం లేదని క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయలేదు. గంగాధర, మధురానగర్, ఒద్యారం, ఉప్పరమల్యాల, నాగిరెడ్డిపూర్, న్యాలకొండపల్లి, కాసారం గ్రామాల్లో పాఠశాలల ఆవరణల్లోనే ఏర్పాటు చేశారు. రంగారావుపల్లి, ఆచంపల్లిలో వరదకాలువ సమీపంలో ఏర్పాటు చేశారు. మంగపేటలో ఊరికి దూరంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేశారు. వాస్తవానికి ఎకరా స్థలంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాల్సి ఉండగా స్థానికంగా పది గుంటల స్థలం కూడా అందుబాటులో లేకపోవడం, ఉన్నా దూరంగా ఉండటం, చివరకు పాఠశాలల మైదానాలే క్రీడా ప్రాంగణాలుగా ఏర్పాటు చేస్తున్నారు. స్థలం అందుబాటులో లేక.. – భాస్కర్‌రావు, ఎంపీడీవో , గంగాధర33 గ్రామ పంచాయతీలతోపాటు 5 ఆవాస గ్రామాల్లో క్రీడా ప్రాంగ ణాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం ఉండగా చాలా గ్రామాల్లో స్థల సమస్య ఇబ్బందిగా మారింది. స్థలం లేనిచోట ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల మైదానాల్లోనూ చిన్నారులు ఆడుకునేం దుకు అవసరమైన క్రీడా పరికరాలు ఏర్పాటు చేస్తున్నాం. చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తుంది.

## నాటడం ముగిసింది.. సంరక్షణ మిగిలింది

సారంగాపూర్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న హరితహారం లక్ష్యం ఏటా పూర్తి చేస్తున్నప్పటికీ మొక్కలు పూర్తి స్థాయిలో కనపడడంలేదు. ఈ ఏడాది జిల్లా లక్ష్యం 40 లక్షలు కాగా నాటడం పూర్తి చేసినప్పటికీ, మొక్కల సంరక్షణలో ఏటా విఫలమవుతూనే ఉన్నారు. కేవలం లక్ష్యం కోసం కాకుండా నాటిన ప్రతి మొక్కను కాపాడుకున్నప్పుడే హరితలక్ష్యం నెరవేరనుంది. జిల్లాలో డీఆర్డీఏ ద్వారా 30 లక్షలు కాగా మిగతా ఇతర శాఖల ద్వారా మరో 10 లక్షల మొక్కలను నాటేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారు. కేవలం డీఆర్డీఏ, అటవీ, ఉద్యానవన శాఖ మినహా ఇతర శాఖల లక్ష్యం పూర్తి చేయలేకపోయారు. కొన్ని శాఖలకు వందల్లో లక్ష్యం నిర్దేశించినా నాటడంలో నిర్లక్ష్యం చేశారు. అటవీ శాఖ లక్ష్యం కేవలం 25 వేలు కాగా 5 లక్షల మొక్కలు నాటడం విశేషం. కాగా ఇంటింటికీ సెర్ప్ ద్వారా 5 లక్షల మొక్కలను పంపిణీ చేశారు. కొన్ని మండలాల్లో లక్ష్యానికి మించి మొక్కలను నాటగా మిగతా మండలాల్లో లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంది. అయితే లక్ష్యం పూర్తి చేసినప్పటికీ నర్సరీల్లో మొక్కలు చాలా వరకు అలాగే ఉండిపోయాయి.

ఇంటింటికీ లెక్కలు.. వృథాగా మొక్కలు

ప్రతి ఇంటికి అయిదు చొప్పున మొక్కలను సరఫరా చేస్తున్నారు. ఎనిమిది విడతలుగా ఒక్కో ఇంటికి 40 మొక్కల చొప్పున అందించారు. ఇందులో ఒక్కో ఇంట్లో నాలుగు మొక్కలు కూడా కనిపించనివి చాలా ఉన్నాయి. అంతేకాకుండా మొక్కలు కేవలం లక్ష్యం కోసం ఇంటింటికీ అందిస్తున్నారే తప్పా.. వారికి అవసరమైనవి అందించకపోవడంతో తీసుకున్న వెంటనే పక్కన పడేస్తున్నారు. కొందరు ఇంటి ఆవరణలో స్థలం లేనప్పటికీ మొక్కలు అందించడంతో వృథా అవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇళ్లలో నాటే పండ్లు, పూలవి కాకుండా ఇతర మొక్కలు అందించడం ద్వారా పక్కన పడేస్తుండడం గమనిస్తూనే ఉన్నారు. అయినప్పటికీ మొక్కలను ఏటా అందించడం.. ఆ తరువాత పడేయడం పరిపాటిగా మారింది. గతంలోనే ఇంటి యజమానులకు అవసరమైన మొక్కలను అందించాలని గతంలో అధికారుల పేర్కొన్నప్పటికీ అందించడంలేదన్న విమర్శలు ఉన్నాయి.

అటవీశాఖ సఫలం

అటవీశాఖ ఆధ్వర్యంలో నాటుతున్న మొక్కలు ఏపుగా ఎదుగుతూ సత్ఫలితాలిస్తున్నాయి. డీఆర్డీఏ ఉపాధి హామీ పథకం ద్వారా బ్లాక్ ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నా మొక్కల ఎదుగుదల లేకపోవడమే కాకుండా కనిపించడంలేదు. ఇందుకు ప్రధానంగా గుంతలు తీయడం, నాటేందుకు తీసుకెళ్లిన మొక్కలను నాటకుండానే పడేయడం, భూమి చదును చేసి నాటే పద్ధతిలో కూడా తేడా ఉంటుంది. అటవీ శాఖ ద్వారా నాటుతున్న మొక్కలు కనీసం నీరు కూడా అందించకుండా ఎదుగుతుండగా, ఉపాధి హామీ ద్వారా వేసవిలో నీరు అందిస్తున్నా సగానికి పైగా మొక్కలు ఎండిపోతున్నాయి. రెండు శాఖల మధ్య మొక్కల ఎదుగుదల వ్యత్యాసాన్ని గమనించి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

వ్యయం అధికం..

నర్సరీల్లో పాలిథిన్ కవర్లలో మట్టినింపి విత్తనాలు నాటి మొక్కలు సిద్ధం చేయడం నుంచి నాటడం వరకు ఒక ఎత్తయితే.. వాటిని నాటిన తరువాత సంరక్షణలో నిర్లక్ష్యం చేస్తున్నారు. దీనివల్ల ఒక్కో మొక్క నాటడానికి, పాదులు తీయడానికి రూ. 22 చెల్లిస్తుండగా, వాటికి ఏర్పాటు చేసే రక్షణ కంచెలకు రూ. 6 అందజేస్తున్నారు. నీరు పోసేందుకు రూ. 5 అదనంగా చెల్లిస్తున్నారు. ఇంత వ్యయం చేసినా మొక్క బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి. హరితహారంలో నిబంధనల ప్రకారం నాటిన మొక్క ఎండిపోతే దాని స్థానంలో మరొకటి నాటించాలి.

# దిగ్విజయంగా 'భవిష్యత్‌కు గ్యారంటీ' బస్సు యాత్ర



ఎన్టీఆర్ జిల్లా: "భవిష్యత్‌కు గ్యారంటీ" బస్సు యాత్రలో భాగంగా మైలవరం నియోజకవర్గంలోని జి. కొండూరులో జరిగే బహిరంగ సభ ప్రదేశాన్ని మాజీ మంత్రి, టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సు యాత్రను జయప్రదం చేయాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం దేవినేని ఉమా మాట్లాడుతూ.. రాష్ట్రంలో భవిష్యత్‌కు గ్యారంటీ బస్సు యాత్ర దిగ్విజయంగా జరుగుతోందన్నారు. 7, 8 తేదీల్లో తిరువూరు, మైలవరం నియోజకవర్గాలల్లో భవిష్యత్‌కు గ్యారంటీ బస్సు యాత్ర ఉంటుందన్నారు. బస్సు యాత్రలో భాగంగా చింతలపూడి ప్రాజెక్ట్ సందర్శన ఉంటుందని తెలిపారు. చింతలపూడికి రూ.5 వేల కోట్లు తెచ్చి, నాలుగు కోట్లు ఖర్చు పెట్టామని తెలిపారు. చింతలపూడిని వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. చింతలపూడి ప్రాజెక్ట్ ప్రాముఖ్యత వైసీపీ ప్రభుత్వానికి తెలియదన్నారు. చింతలపూడి నిర్మాణం కోసం ఉంచిన మెటీరియల్‌ను దొంగలు ఎత్తుకుపోయారన్నారు. భవిష్యత్ గ్యారంటీ బస్సు యాత్రలో కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నాయకులు పాల్గొంటారని.. బస్సు యాత్రను టీడీపీ శ్రేణులు విజయవంతం చేయాలని అన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే భవిష్యత్‌కు గ్యారంటీలో భాగంగా మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ అమలు చేయబోయే పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్ళాలని దేవినేని ఉమా సూచించారు.

# నాలుగేళ్ల పాలన.. 51% జనాదరణ ఒక్క వైయస్ఆర్ సీపీకే సాధ్యం

## వైయస్ఆర్ సీపీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్, ఎంపీ విజయసాయిరెడ్డి



తాడేపల్లి: ఏ రాష్ట్రంలోనైనా 4 సంవత్సరాల పరిపాలన తర్వాత కూడా అక్కడి పాలకపక్షానికి 51 శాతం ప్రజాదరణ సాధ్యమేనా..? అనే ప్రశ్నకు జనరంజకంగా ప్రభుత్వాన్ని నడిపే పార్టీకి ఇది సంభవమేనని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నిరూపిస్తోందని వైయస్ఆర్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్, ఎంపీ విజయసాయిరెడ్డి అన్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని మతాలు, కులాల ప్రజల మద్దతుతో జనసంక్షేమమే ఏకైక లక్ష్యంగా 2019 నుంచీ ముందుకుసాగుతున్న వైయస్ఆర్ సీపీకి 51 శాతం ప్రజల మద్దతు లభిస్తుందని తాజా సర్వేలో తేలిందన్నారు. ప్రసిద్ధ మీడియా సంస్థ టైమ్స్ నౌ నవభారత్ ఈటీజీతో కలిసి ఈ జనాభిప్రాయసేకరణ జరిపిందని చెప్పారు. ఈ మేరకు ఎంపీ విజయసాయిరెడ్డి తన ఫేస్‌బుక్ ఖాతాల్లో ఓ స్టోరీని పోస్టు చేశారు. లోక్ సభ ఎన్నికలకు ఏడాది ముందు దేశవ్యాప్తంగా జరిపిన ఈ సర్వేలో ఆంధ్రప్రదేశ్ వరకూ చూస్తే.. పాలకపక్షమైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలోని మొత్తం 25 సీట్లలో 24-25 వరకూ రావొచ్చని స్పష్టమైంది. అంతేగాక, పోలయ్యే మొత్తం ఓట్లలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైయస్ఆర్ సీపీకి 51 శాతం ఓట్లు వస్తాయని కూడా ఈ సర్వే సూచిస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశం పార్టీకి కేవలం 36 శాతం ఓట్లే వస్తాయని ఈ సర్వే వివరించింది. నాలుగేళ్ల క్రితం 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైయస్ఆర్ సీపీకి 49.95% ఓట్లు లభించాయి. టీడీపీకి 39.17% ఓట్లు దక్కాయి. అప్పటికి ఆంధ్రప్రదేశ్‌లో ఏ ఎన్నికల్లో కూడా పాలకపక్షానికి దాదాపు 50% ఓట్లు రాలేదు. అలాంటిది వైయస్సార్ కాంగ్రెస్ 49.95 శాతం ఓట్లు కైవసం చేసుకోవడం ఓ రికార్డు అయితే, పై సర్వే ప్రకారం ఇప్పుడు ఏపీ పాలకపక్షానికి 51 శాతం ఓటర్ల ఆమోదం లభించడం మరో ఘనవిజయం. సాధారణంగా ఎంతటి గొప్ప రాజకీయ పార్టీ అయినా నాలుగేళ్లు అధికారంలో ఉన్న తర్వాత జనాదరణను స్వల్ప స్థాయిలోనైనా కోల్పోతుంది. కానీ, ఇలాంటి సిద్ధాంతాలు, ఆనవాయితీలు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వర్తించవని తెలుగునాట రుజువైంది.

అలాగే, అతి తక్కువ సీట్లతో ప్రతిపక్ష స్థానానికి పరిమితమైన పూర్వపు పాలకపక్షం టీడీపీ రోజురోజుకూ జనం మద్దతు పోగొట్టుకోవడం పాలకపక్షం పనితీరుకు, సామర్థ్యానికి తార్కాణం.

**ప్రాంతీయ పక్షాలకు పార్లమెంటు కన్నా అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓట్లు! :** టౌమ్స్ నౌ-నవభారత్ ఈటీజీలు కేవలం 2024 పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ సర్వే నిర్వహించాయి. ఈ లెక్కన మరో తొమ్మిది నెలల్లో లోక్ సభతోపాటు ఏపీ శాసనసభకు జరిగే ఎన్నికల్లో వైయస్ఆర్ సీపీకి ఓట్ల శాతం ఇంకా పెరిగే అవకాశాలే ఎక్కువ. దేశంలో ప్రాంతీయపక్షాలకు లోక్ సభ ఎన్నికల్లో కంటే అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓట్లు సాధించడం ఎప్పటి నుంచో వస్తున్న ఆనవాయితీ. ఈ సూత్రానికి భిన్నంగా పార్లమెంటు ఎన్నికల్లో సైతం ఏపీ పాలక పార్టీ 50 శాతానికి మించి ఓట్లు సాధించబోతోందని ఈ సర్వే సూచిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తి చేసుకున్నప్పటి నుంచి ప్రతి ఏటా ఏదో ఒక ప్రముఖ మీడియా సంస్థ జరిపించిన ప్రతి సర్వేలోనూ ఈ పార్టీకి మంచి జనాదరణ ఉందనే సర్వేల ఫలితాలు తెలిపాయి. ఇలా వరుసగా ప్రతి సర్వేలోనూ మెజారిటీ ప్రజల ఆదరణ పొందిన ఏకైక రాజకీయపక్షం కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీయే. ఎప్పటి మాదిరిగానే సీఎం వైయస్ జగన్ ప్రభుత్వానికి, పాలకపక్షానికి మద్దతు ఇవ్వడంలో మహిళలు ముందున్నారని కూడా అనేక ఓపీనియన్ పోల్స్, సర్వేలు తేల్చిచెబుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ లో అమలవుతున్న వివిధ పథకాలు మహిళలకు గరిష్ఠ స్థాయిలో ప్రయోజనాలు అందించడమేగాక, మహిళా సాధికారితకు దోహదం చేయడం దీనికి కారణం.

కొద్దిమంది పురుష ఓటర్లకయినా ఎప్పుడైనా తమ సామాజికవర్గం ఏమిటనే స్పృహ ఉండవచ్చేమో గానీ, పాలకపక్షం సంక్షేమ కార్యక్రమాల ఫలితంగా ఆంధ్రా మహిళలు కులాలు, వర్గాలకు, ప్రాంతాలకు అతీతంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎక్కువగా అభిమానిస్తున్నారని కూడా వరుసగా అనేక సర్వేలు చెబుతున్నాయి.




# తెలుగు రాష్ట్రాలకు భాజపా అధ్యక్షులు — ఏపీకి పురందేశ్వరి.. తెలంగాణకు కిషన్‌రెడ్డి

దిల్లీ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ భాజపా తన వ్యూహాలకు మరింత పదును పెడుతోంది. ఇందులో భాగంగా తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల్లో సంస్థాగతంగా కీలక మార్పులు చేసింది. ఏపీలో సోము వీర్రాజు, తెలంగాణలో బండి సంజయ్‌లను పార్టీ సారథ్య బాధ్యతల నుంచి తప్పించిన భాజపా అధిష్ఠానం.. ఆ స్థానంలో పురందేశ్వరి, జి.కిషన్ రెడ్డిలను నియమించింది. ఏపీ భాజపా చీఫ్‌గా కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి, తెలంగాణ భాజపా చీఫ్‌గా కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని నియమిస్తూ భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్ణయం తీసుకున్నట్టు ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని పేర్కొన్నారు. అలాగే, తెలంగాణలో భాజపా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా ఈటల రాజేందర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఏపీ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని భాజపా జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు.

వీరితో పాటు ఝార్ఖండ్ భాజపా చీఫ్‌గా మాజీ సీఎం బాబూలాల్ మరాండీబీ పంజాబ్ భాజపా నూతన అధ్యక్షుడిగా సునీల్ జాఖడ్‌ను నియమించినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

**పురందేశ్వరి ఇలా...** దగ్గుబాటి పురందేశ్వరి 1959 ఏప్రిల్ 22న జన్మించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి రాజకీయ ప్రవేశం చేసిన పురందేశ్వరి.. 2004లో బాపట్ల నుంచి.. 2009లో విశాఖ నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసి గెలిచారు. యూపీఏ హయాంలో కేంద్రమంత్రిగానూ పనిచేశారు. ఏపీ విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీ తీరును వ్యతిరేకిస్తూ పార్టీని వీడారు. ఆ తర్వాత 2014లో పురందేశ్వరి భాజపాలో చేరారు. భాజపాలో మహిళా మోర్చా ప్రధాన ప్రభారిగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం భాజపాకు ఒడిశా రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా ఉన్న పురందేశ్వరికి.. వచ్చే లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఏపీ బాధ్యతలు అప్పగిస్తూ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకుంది.

**కిషన్ రెడ్డికి రెండోసారి...** కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గతంలోనూ భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. 2010-14 మధ్య ఉమ్మడి ఏపీకి, 2014-16 మధ్య తెలంగాణకు భాజపా అధ్యక్షుడిగా కిషన్‌రెడ్డి బాధ్యతలు నిర్వర్తించారు. 2016-18 మధ్య శాసనసభాపక్ష నేతగా వ్యవహరించారు. అనంతరం 2019 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా కొనసాగుతున్నారు. అధిష్ఠానం తీసుకున్న తాజా నిర్ణయంతో ఇకపై ఆయన తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు నిర్వహించనున్నారు.




# అనారోగ్యమైతే ప్రమాణం ఆపాలా..? ఇదేం వింత..!

దిల్లీ: దేశ రాజధాని నగరం దిల్లీలో లెఫ్టినెంట్ గవర్నర్, ఆప్ ప్రభుత్వం మధ్య నిత్యం ఏదో ఒక అంశంపై వివాదం నడుస్తూనే ఉంటుంది. తాజాగా దిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కొత్త ఛైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం విషయంలో విభేదాలు భగ్గుమన్నాయి. తన అనారోగ్యం కారణంగా ఈ కార్యక్రమాన్ని ఆప్ నేత, విద్యుత్ శాఖ మంత్రి అతిషి వాయిదా వేయగా.. డిజిటల్ యుగంలో ఇదేం తీరు అంటూ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఆయన లేఖ రాశారు. 'ఈ డిజిటల్ యుగంలో రాష్ట్రపతి 2023 జూన్ 21న ఇచ్చిన నోటిఫికేషన్‌ను అమలు చేయకలేకపోతున్నట్లు మంత్రి వెల్లడించడం వింతగా అనిపిస్తోంది' అని సక్సేనా అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఈ ప్రక్రియను వర్చువల్‌గా పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ ఉదయం పదిగంటలకు దానిని పూర్తి చేయాలని వెల్లడించగా.. ఆ సమయానికి ఎల్‌జీ ఆదేశాలు అమలుకాలేదు.

**ఏం జరిగిందంటే..? :** జస్టిస్ ఉమేశ్ కుమార్.. అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి. ఆయన దిల్లీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. వాస్తవంగా మంత్రి అతిషి సోమవారం సాయంత్రం ఈ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నారని దిల్లీ ప్రభుత్వ అధికారి ఒకరు వెల్లడించారు. దానికి సంబంధించి జస్టిస్ ఉమేశ్‌కు సమాచారం ఇచ్చారు. దానికి ఆయన కూడా అంగీకరించారు. తర్వాత అనూహ్యంగా అతిషి అనారోగ్యానికి గురయ్యారు. దాంతో ఆ కార్యక్రమం కాస్తా గురువారానికి వాయిదా పడింది.

**సుప్రీంకోర్టులో ఎల్జీకి చుక్కెదురు..** దేశ రాజధాని పరిధి దిల్లీలో గ్రూప్ ఏ అధికారుల బదిలీలు, నియామకాలు, క్రమశిక్షణ చర్యలకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేసిన సంగతి తెలిసిందే. దిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల నియామకాలు, బదిలీలపై నియంత్రణాధికారం ఆ రాష్ట్ర ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తర్వాత కేంద్రం ఈ ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. ఈ ఆర్డినెన్స్‌ను ఆప్ తీవ్రంగా వ్యతిరేకించింది. దాంతో ప్రస్తుత నియామకం మరోసారి ఆప్ ప్రభుత్వం, ఎల్జీ మధ్య విభేదాలు సృష్టించింది. దీనిని ఆప్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా.. కేజ్రీవాల్ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వెలువడింది. ఈ ప్రమాణ స్వీకారాన్ని కోర్టు వాయిదా వేసింది. జస్టిస్ ఉమేశ్ కుమార్ ప్రమాణ స్వీకారం నిర్వహణ గురించి లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా.. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అడగకూడదని ఆదేశించింది. దీనికి సంబంధించి కేంద్రం, లెఫ్టినెంట్ గవర్నర్‌కు నోటీసులు ఇస్తామని వెల్లడించింది.




# 'రూ. 7లక్షలిస్తే నీట్ పరీక్ష రాసిపెడతాం!'

# దిల్లీ ఎయిమ్స్ విద్యార్థుల ఘరానా మోసం

దిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షలో భారీ మోసం బయటపడింది. నీట్‌లో ఉత్తీర్ణత సాధించేందుకు అసలైన అభ్యర్థుల స్థానంలో నకిలీ వ్యక్తులతో ఓ ముఠా పరీక్ష రాయిస్తోంది. దేశ రాజధాని దిల్లీలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఎయిమ్స్ విద్యార్థులు నడిపిస్తున్న ఈ 'నీట్ రాకెట్'ను దిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ ముఠా నాయకుడు సహా ఇప్పటివరకు నలుగురు విద్యార్థులను అరెస్టు చేశారు. దిల్లీ ఎయిమ్స్‌లో రేడియాలజీ రెండో సంవత్సరం చదువుతున్న నరేశ్ బిష్రోయ్ ఈ రాకెట్ నడుపుతున్నట్లు పోలీసులు తెలిపారు. నీట్ పరీక్షలో అభ్యర్థుల స్థానంలో నకిలీ వ్యక్తులను ఏర్పాటు చేయించి నరేశ్ వారితో పరీక్ష రాయిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. డబ్బులు ఆశజూపి అనేక మంది ఎయిమ్స్ విద్యార్థులను నిందితుడు తన గ్యాంగ్‌లో చేర్చుకున్నాడు. ఎక్కువగా ఎయిమ్స్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతో నీట్ పరీక్ష రాయించేవాడు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన నీట్ ప్రవేశ పరీక్షలో నరేశ్ గ్యాంగ్‌కు చెందిన పలువురు.. అభ్యర్థుల స్థానంలో పరీక్ష రాస్తూ అధికారులకు చిక్కారు. ఎయిమ్స్‌లో రేడియాలజీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సంజూ యాదవ్ అనే విద్యార్థి.. వేరే అభ్యర్థి స్థానంలో నీట్ పరీక్ష రాస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికాడు. అలాగే, మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌లో గల ఓ నీట్ పరీక్షా కేంద్రంలో మరో ఇద్దరు విద్యార్థులు మహావీర్, జితేంద్ర కూడా ఇలాగే పట్టుబడ్డారు. దీంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. అనంతరం వారిని విచారించగా.. ఈ ముఠా గుట్టు రట్టయ్యింది. దీంతో సోమవారం ఈ ముఠా నాయకుడు నరేశ్ బిష్రోయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నరేశ్ తన రెండో సంవత్సరం పరీక్ష రాస్తుండగా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.

**ఒక్కో డీల్‌కు రూ.7లక్షలు..** విచారణలో ఈ గ్యాంగ్ గురించి కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నకిలీ విద్యార్థులతో ప్రవేశ పరీక్ష రాయించేందుకు ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 7లక్షలతో ఈ గ్యాంగ్ డీల్ కుదుర్చుకున్నట్లు పోలీసులు తెలిపారు. తొలుత రూ.లక్ష అడ్వాన్స్ తీసుకుని, పరీక్ష రాసిన తర్వాత రూ.6లక్షలు చెల్లించేవారట. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ముఠాలో ఇంకా ఎంతమంది విద్యార్థులున్నారనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# రాధాకు వెన్నుపోటు పొడిచిన జగన్‌కు గుండెపోటు తెప్పించడం ఖాయం



విజయవాడ: వంగవీటి మోహనరంగా జయంతి వేడుకల్లో జనసేన నేత పోతిన వెంకట మహేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. రంగాను ప్రభుత్వాలు గుర్తు పెట్టుకోక పోయినా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. ఆయన స్ఫూర్తితో సమస్యలపై అనేక మంది పోరాటం చేస్తున్నారని తెలిపారు. రంగా తనయుడు రాధాకృష్ణకు రాజకీయంగా వెన్నుపోటు పొడిచిన జగన్‌కు గుండె పోటు తెప్పించడం ఖాయమన్నారు. నాలుగేళ్లుగా రాధాకృష్ణ రాజకీయ ప్రతీకారం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. వంగవీటి మోహనరంగా విగ్రహాలు ఆవిష్కరిస్తూ, సమస్యలపై రాధా అధ్యయనం చేశారన్నారు. తనను మోసం చేసిన వారందరికి రాధాకృష్ణ రాజకీయ సమాధి కడతారని స్పష్టం చేశారు. రంగాకు నిజమైన వారసుడు రాధాకృష్ణ అని అన్నారు. ఆయన చెప్పిన మాట ప్రకారం అందరూ కలిసి నడవాలని సూచించారు. వైసీపీలో రాధా ఉన్న సమయంలో సీఎం జగన్మోహన్ రెడ్డి రంగా జయంతి, వర్ధంతి నిర్వహించారని.. మరి ఇప్పుడు అదే జగన్... రంగాకు నివాళి ఎందుకు అర్పించడం లేదని ప్రశ్నించారు. ఎన్నికల సీజన్ రావడంతో రంగా పేరు చెప్పి నటిస్తున్నారని, జీవిస్తున్నారని మండిపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే రంగా పేరుతో పథకం గానీ, జిల్లా పేరు కానీ పెట్టించాలని డిమాండ్ చేశారు. రంగా పేరు చెప్పి ఓట్లు వేయించుకున్న పాలకులు జగన్‌ను నిలదీయాలన్నారు. సూర్యచంద్రులు ఉన్నంత కాలం రంగా పేరు ఉంటుందని తెలిపారు. రంగా పేరు చెప్పకుండా ఏ రాజకీయ పార్టీలు, పార్టీ కూడా రాజకీయం చేయలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి అన్ని పథకాలు ఎత్తేసి అందరినీ మోసం చేశారని పోతిన వెంకట మహేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మన్మోహన్‌ను అయినా ఒప్పించటం సులువు కానీ.. రోశయ్యను మాత్రం..



గుంటూరు: తెనాలి కాంగ్రెస్ పార్టీ ఆఫీస్‌లో మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, పట్టణ అధ్యక్షుడు చందు సాంబశివుడు నివాళలర్పించారు. ఈ సందర్భంగా కేవీపీ మాట్లాడుతూ... అపారమైన శ్రమపడేతత్వం, ఆర్థిక క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేయటం లాంటి తత్వం ఉన్న గొప్ప వ్యక్తి రోశయ్య అని కొనియాడారు. మన వల్ల భావితరాలకు అప్పుల భారం పడకూడదని ఆలోచించే వ్యక్తి రోశయ్య అని అన్నారు. ఆర్థికపరంగా గొప్ప ఎకనామిస్ట్ అయిన మన్మోహన్ సింగ్‌ను ఒప్పించటం సులువు కానీ రోశయ్యను మాత్రం ఒప్పించలేకపోయే వాళ్ళమని గుర్తుచేసుకున్నారు. ప్రజల డబ్బులకు ధర్మకర్తలం మాత్రమే ఆర్థిక క్రమశిక్షణ తప్పితే రాబోయే రోజుల్లో ప్రజలపై భారం పడుతుందని చెప్పేవారని తెలిపారు. ప్రజా ధనానికి రోశయ్య ట్రస్టీగా మాత్రమే ఉండేవాళ్ళన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఇవాల్టికి ఆర్థిక శక్తిగా ఉంది అంటే రోశయ్య పునాదులే కారణమన్నారు. రోశయ్య కాంగ్రెస్ పార్టీకి చేసిన సేవలు అమూల్యమైనవి అంటూ కేవీపీ పేర్కొన్నారు.

# మీ టర్మ్ అయిపోయింది.. మిమ్మల్ని తొలగిస్తున్నామంటూ సోము వీర్రాజుకు జేపీ నడ్డా సడెన్ షాక్..

అమరావతి : ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజును తొలగించారు. ఏమాత్రం చడీచప్పుడు లేకుండా ఇది జరిగిపోయింది. ఇటీవలి కాలంలో మన ఫోకస్ అంతా ఎంతసేపూ తెలంగాణ మీదే ఉంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలాగే ఉన్నాయి. అధిష్టానం నుంచి బండి సంజయ్‌కు కాల్ రావడం.. ఆయన హుటాహుటిన నిన్న హస్తినకు బయలుదేరి వెళ్లడం చకచకా జరిగిపోయాయి. పైగా ఆయనను తెలంగాణ బీజేపీ చీఫ్ పదవి నుంచి తప్పించి దానిని కేంద్ర మంత్రికి కిషన్ రెడ్డికి కట్టబెడతారంటూ గత కొంతకాలంగా టాక్ నడుస్తోంది. ఈ క్రమంలోనే తెలంగాణ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడు సోము వీర్రాజు తొలగింపుతో ఏపీ చర్చనీయాంశంగా మారింది. ఏపీ బీజేపీ అధ్యక్షుడిగా సోము వీర్రాజును తొలగిస్తున్నట్టు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా స్వయంగా ఆయనకే ఫోన్ చేసి చెప్పి షాక్ ఇచ్చారు. కొద్దిసేపటి క్రితం సోము వీర్రాజుకు జేపీ నడ్డా ఫోన్ చేశారు. ' మీ టర్మ్ అయిపోయింది.. మిమ్మల్ని తప్పిస్తున్నాం.. రాజీనామా చేయాలి' అని సూచించారు. బీజేపీ కార్యాలయంలో అల్లూరి సీతా రామరాజు జయంతి కార్యక్రమాన్ని సోము వీర్రాజు నిర్వహించిన కాసేపటికే ఈ షాకింగ్ న్యూస్ ఆయన వినాల్సి వచ్చింది. ఏపీలో ఇటీవలి కాలంలో ఆయనపై కొందరు బీజేపీ నేతలు ఆగ్రహంతో ఉన్నారు. అదీ చాలదన్నట్టు కన్నా లక్ష్మీనారాయణ పార్టీని వీడటానికి కూడా కారణం సోమూ వీర్రాజేనన్న టాక్ నడిచింది. ఈ క్రమంలోనే అధ్యక్షుడి మార్పు ఆవశ్యకమని అధిష్టానం భావించినట్టు తెలుస్తోంది. ఇక ఏపీ బీజేపీ అధ్యక్షుడి రేసులో సత్యకుమార్, సుజనా చౌదరి పేర్లు వినిపిస్తున్నాయి.

# రంగా లక్ష్యాలను సాధించడంలో పునరంకితమవుతాం



విజయవాడ: గుడివాడ వైఎస్ఆర్సీపీ కార్యాలయంలో వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రంగా విగ్రహానికి ఎమ్మెల్యే కొడాలి నాని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కొడాలి నాని మాట్లాడుతూ.. రంగా ఆశీస్సులతో ఆయన వదిలి వెళ్ళిన లక్ష్యాలను సాధించడంలో పునరంకితమవుతామన్నారు. కులం కోసం కాకుండా పేద ప్రజల కోసం కష్టపడిన మహోన్నత వ్యక్తి రంగా అని కొనియాడారు. నమ్ముకున్న సిద్ధాంతాల కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు రంగా అని అన్నారు. రాజకీయ ఒత్తిడిలతో వంగవీటి మోహనరంగా హత్యకు గురయ్యారని తెలిపారు. భౌతికంగా దూరమై 35 ఏళ్లు గడిచినా ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన వ్యక్తి వంగవీటి రంగా అని అన్నారు. నేటి రాజకీయాల్లో రంగా పేరు మీద ప్రభుత్వాలే మారిపోయే పరిస్థితి ఉందన్నారు. రాధా బాబుకు రాజకీయాల్లో ఉజ్వలమైన భవిష్యత్తును దేవుడు కల్పించాలని ఎమ్మెల్యే కొడాలి నాని ఆకాంక్షించారు.

## సోఫాలో రసగుల్ల ఇలా కోలుకుందో లేదో కానీ..!

యాక్సిడెంట్ లో చేయి విరగ్గొట్టుకుని నభానటేష్ తీవ్రంగా ఇబ్బందికి గురైన సంగతి తెలిసిందే. ప్రమాదంలో శరీరంపై పలు చోట్ల గాయాలయ్యాయి. అయితే ఎముకలు విరిగాక నొప్పి భరించలేనంతగా ఉందని నభా బాధను వ్యక్తం చేసింది. దీనికి శస్త్ర చికిత్స జరిగింది. కొంతకాలం పాటు పరిశ్రమకు దూరంగా ఉండాల్సి వస్తున్నందుకు చాలా ఆవేదనగా ఉన్నానని నభా తెలిపింది. అయితే ఎట్టకేలకు అన్ని గాయాల నుంచి కోలుకుని తిరిగి యాక్టివ్ అయినట్టే కనిపిస్తోంది. నెమ్మదిగా కోలుకుని తిరిగి తనదైన ఎనర్జీని పుంజుకుంటోంది ఈ ఇస్మార్ట్ భామ. ఇంతలోనే తనదైన శైలిలో



అద్భుతమైన ఫోటోషూట్ తో నభా నటేష్ వెబ్ లోకి దూసుకొచ్చింది. చినుగుల డెనిమ్ ఫ్యాంట్ .. కాంబినేషన్ గా చారల చొక్కాలో నభా సరికొత్తగా కనిపించింది. ఇక బటన్ లెస్ షర్ట్ లో నభా అందాల హిందోళం యూత్ లో కిక్కు పెంచింది. టూమచ్ గా చినిగిన బ్లూ జీన్స్ నభా పోష్ లుక్ ని ఎలివేట్ చేస్తోంది. చేతిలో కప్పు కాఫీతో అలా కురులను సరి చేసుకుంటూ కనిపించింది. వాస్తవానికి ముందు మీ కాఫీని తాగండి..!! అంటూ ఈ ఫోటోలను షేర్ చేసింది.

నభా నటేష్ కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ విజయంలో నభా కీరోల్ గురించి తెలిసినదే. రామ్ పెర్ఫామెన్స్ కి ధీటుగా మాస్ పెర్ఫామెన్స్ తో కట్టి పడేసింది. కోస్టార్ నిధి కంటే నభాకి ఎక్కువ మార్కులు పడ్డాయి. ఆ తర్వాత ఈ బ్యూటీ డిస్కోరాజా, అల్లుడు అదుర్స్, మాస్ట్రో, చిత్రాల్లో హీరోయిన్ గా నటించింది.

అన్ని పెద్ద ప్రాజెక్ట్ లే. కానీ వైఫల్యాలు ఎదురయ్యాయి. ఇక ఇస్మార్ట్ శంకర్ బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత ఈ బ్యూటీ పారితోషికం భారీగా పెంచేసిందని గుసగుసలు వినిపించాయి. నభా తదుపరి సినిమాల గురించి అప్ డేట్ తెలియాల్సి ఉంది.

## అవమానం జరిగిన చోటే గౌరవం దక్కించుకున్న శోభిత

గూఢచారి సినిమా తో తెలుగు ప్రేక్షకులకు చేరువ అయిన ముద్దుగుమ్మ శోభిత దూళిపాళ్ల. ఈ అమ్మడు బాలీవుడ్ లో అంతకు ముందు సినిమాలు చేయడంతో చాలా శాతం మంది ఈమె నార్త్ ఇండియన్ అనుకున్నారు. కానీ శోభిత తెలుగు అమ్మాయి. మోడలింగ్ పై ఆసక్తితో చిన్న వయసులోనే ప్రయత్నాలు మొదలు పెట్టిందట. ప్రస్తుతం సౌత్ తో పాటు బాలీవుడ్ లో కూడా పలు సినిమాల్లో నటిస్తున్న ముద్దుగుమ్మ శోభిత ధూళిపాళ్ల వరుసగా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నాకు 20 ఏళ్ల వయసు ఉన్న సమయంలోనే మోడలింగ్ చేయాలనుకున్నారు. అప్పుడు ఒక



షాంపూ కంపెనీ యొక్క వాణిజ్య ప్రకటన లో నటించేందుకు వెళ్లాను. ఆ సమయంలో కంపెనీ వారు నన్ను కనీసం బ్యాక్ గ్రౌండ్ లో కనిపించే మోడల్ గా కూడా పనికి రావు అంటూ అవమానించారు. ఆ సమయంలో శోభిత మౌనంగా అక్కడ నుండి వచ్చేసిందట. కానీ కొన్నాళ్ల తర్వాత అదే సంస్థ యొక్క బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది. శోభిత ఈ మధ్య కాలంలో మోడల్ గా మరియు హీరోయిన్ గా బిజీ బిజీగా ఉంది. ఈ సమయంలోనే అక్కినేని హీరో నాగ చైతన్య తో ప్రేమలో ఉందనే పుకార్లతో వార్తల్లో నిలిచింది. ఆ విషయం వాస్తవం కాదని పలు సార్లు శోభిత పేర్కొంది. అయినా కూడా పుకార్లు ఆగడం లేదు.




## స్టైలిష్ ఆటిట్యూడ్ తో నిలబడి వలపుల బాణాలు!



మెంటల్ మదిలో మూవీతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన తమిళ్ భామ నివేతా పెతురాజ్. మొదటిచిత్రంతోనే నటిగా మార్కులు కొట్టేసిన ఈ అమ్మడు రెండో సినిమాని కూడా శ్రీవిష్ణుతోనే చేసింది. అయితే తెలుగు కంటే ముందుగానే మాతృభాష తమిళంలో హీరోయిన్ గా సక్సెస్ అయ్యింది. చిత్రలహరి మూవీతో తేజ్ కి జోడీగా నటించి సక్సెస్ అందుకుంది. త్రివిక్రమ్ అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన అల వైకుంఠపురంలో మూవీలో సెకండ్ హీరోయిన్ గా నివేతా నటించింది. అయితే ఆ మూవీ ఆశించిన స్థాయి గుర్తింపు అయితే ఈ బ్యూటీకి ఇవ్వలేదు. ఈ ఏడాది విశ్వక్ సేన్ కి జోడీగా దాస్ కా దమ్కీ చిత్రంతో ప్రేక్షకుల ముందుకి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ని తన ఖాతాలో వేసుకుంది. సినిమాలో నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నివేతా కనిపించడం విశేషం. ప్రస్తుతం తమిళంలో పార్టీ అనే చిత్రంతో ప్రేక్షకులని పలకరించడానికి ఈ అమ్మడు సిద్ధం అవుతోంది. చేసిన సినిమాలు తక్కువే అయిన నివేతా కెరియర్ లో సక్సెస్ లు ఎక్కువని చెప్పొచ్చు. తెలుగులో ఆమె నటించిన సినిమాలన్నీ హిట్ టాక్ తెచ్చుకున్నవే. ఇక ఈ అమ్మడు మరీ శృతి మించి అందాల ప్రదర్శన చేయకపోయిన టెంప్టింగ్ షేపులతో కట్టిపడేస్తూ ఉంటుంది. అందుకే సోషల్ మీడియాలో నివేతా పేతురాజ్ కి మంచి ఫాలోయింగ్ ఉంది. రెగ్యులర్ గా ఇన్‌స్టాగ్రామ్ లో గ్లామర్ ఫోటోలని ఈ బ్యూటీ పంచుకుంటూ ఉంటారు. వాటికి లక్షల్లో లైక్స్ వస్తూ ఉంటాయి. తాజాగా మరోసారి అదిరిపోయే సోకులని టెంప్ట్ చేసే ఫోజులతో చూపిస్తూ కుర్రాళ్ళకి చెమటలు పట్టిస్తోంది. వైట్ కలర్ నైట్ డ్రెస్ వేసి షర్ట్ బటన్స్ తీసేసి ఎద అందాలని సెల్ఫీ ఫోజులతో చూపిస్తోంది. అలాగే స్టైలిష్ ఆటిట్యూడ్ తో నిలబడి వలపుల బాణాలు విరుసుతోంది. ఈ ఫోటోలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. నివేతా షేర్ చేసిన ఈ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో ఏకంగా 3.71 లక్షలకి పైగా లైక్ చేయడం విశేషం.

## అమ్మడి వర్కౌట్స్ చూపరులకు చెమటలు



సోషల్ మీడియాలో ముద్దుగుమ్మలు హాట్ ఫోటో షూట్స్ ను షేర్ చేయడం చాలా కామన్ విషయం. అయితే కొందరి ఫోటోలు అందంగా ఉంటే మరికొందరి ఫోటోలు మాత్రం బోల్డ్ గా ఉంటాయి. ఎంతగా స్కిన్ షో చేసినా కూడా కొందరి ఫోటోలు బోల్డ్ గా కాకుండా గ్లామర్ గా అందంగా హాట్ గా ఉన్నాయి అనిపిస్తుంది. సోషల్ మీడియాలో ముద్దుగుమ్మలు పోటీ పడి మరీ తమ హాట్ ఫోటో షూట్స్ షేర్ చేస్తున్నారు. ఈమధ్య కాలంలో ఆ ఫోటో షూట్స్ కాకుండా వర్కౌట్ చేస్తున్నప్పుడు తీసుకున్న ఫోటోలు.. వర్కౌట్ పూర్తి అయిన తర్వాత చెమటతో ఉన్న ఫోటోలను షేర్ చేస్తూ ఉన్నారు. తాజాగా బాలీవుడ్ హాట్ బ్యూటీ ఐషా శర్మ షేర్ చేసిన ఫోటోలు చలికాలంలో కూడా చమటలు పట్టించేలా ఉన్నాయి. ఆమె క్లీవేజ్ షో తో పాటు ఆమె ఒంపు సొంపులు చూడగానే వావ్ అనిపించేలా ఉన్నాయి. కొందరి వర్కౌట్ స్టిల్స్ ఎబ్బెట్టుగా అనిపిస్తాయి. కాని ఐషా శర్మ గ్లామర్ షో మాత్రం వావ్ అనిపించేలా ఉందంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఉదయం ఎండలో వర్కౌట్స్ చేస్తే మంచి ఫిజిక్ తో పాటు ఇలా అందంగా కూడా అవ్వచ్చా అంటూ ఈ అమ్మడి ఫోటోలకు నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నెట్టింట ఈ ఫోటోలు వైరల్ అవుతున్న నేపథ్యంలో ఈమె గురించి తెలుసుకునేందుకు కొందరు ఆసక్తి చూపిస్తున్నారు. ఐషా శర్మ విషయానికి వస్తే.. తెలుగు తో పాటు బాలీవుడ్ లో హీరోయిన్ గా మంచి గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ నేహా శర్మ సోదరి ఐషా శర్మ. బాలీవుడ్ లో ఇప్పుడిప్పుడే ఈమె సినిమాల్లో నటించడం మొదలు పెట్టింది. కెరీర్ ఆరంభించిన వెంటనే కరోనా వల్ల ఆఫర్లు పెద్దగా రావడం లేదు. మళ్లీ పరిస్థితులు చక్కబడితే ఖచ్చితంగా ఈఅమ్మడు బిజీ అవ్వడం ఖాయం అన్నట్లుగా అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇంతటి అందంను ఖచ్చితంగా బాలీవుడ్ ఫిల్మ్ మేకర్స్ వదులుకోరు అనేది సోషల్ మీడియా టాక్.

## పుష్పరాజ్ ని శ్రీదేవి తనయ అలా అనేసిందేమిటీ?

పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా..ఫైర్! అన్న డైలాగ్ థియేటర్లో ఎలా పేలింతో చెప్పాల్సిన పనిలేదు. టైటిల్ కి పర్ ఫెక్ట్ జస్ట్ ఫికేషన్ అది. తగ్గేదేలే!! అన్న డైలాగ్ తోనే పుష్ప రాజ్ పాత్రని సుకుమార్ ఎంత పవర్ ఫుల్ గా డిజైన్ చేసారో అర్థమవుతుంది. పుష్పరాజ్ యాటిట్యూడ్ ప్రవర్తనా విధానం ఎలాంటిదో ఆ డైలాగ్ తోనే ముగింపు వరకూ వినిపిస్తూనే ఉంటుంది. సినిమాకి రివ్యూల పరంగా ప్రతికూలంగా అనిపించినా బాక్సాఫీస్ వద్ద మాత్రం వసూళ్ల సునామీనే సృష్టించింది. ఉత్తరాదిన రిలీజ్ అయిన రెండు రోజుల పాటు జనాలు థియేటర్ వైపు చూసింది లేదు గానీ..అటుపై వచ్చిన మౌత్ టాక్ తో ఒక్కసారిగా సినిమా అలా పైకి లేచింది. ఇప్పుడు ఓటీటీలోకి కూడా అందుబాటులోకి రావడంతో పుష్ప రాజ్ కి బాలీవుడ్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఇప్పటికే ఈ చిత్రాన్ని వీక్షించి బన్నీపైనా కంటెంట్ పైనా ప్రశంసలు కురిపించారు. తాజాగా అతిలోక సుందరి శ్రీదేవి స్వీట్ డాటర్ జాన్వీ కపూర్ కూడా పుష్పని పొగడ్తలతో ముంచెత్తకుండా ఉండలేకపోయింది. అందరికన్నా పుష్ప రాజ్ కి ది బెస్ట్ కాంప్లిమెంట్



ఇచ్చేసింది. ఇన్ స్టా వేదికగా జాన్వీ తన అభిప్రాయాన్ని తెలిపింది. పుష్ప మాస్ గెటప్ ని షేర్ చేస్తూ.. ది కూలెస్ట్ మేన్ ఇన్ ది వరల్డ్ అని క్యాప్షన్ ఇచ్చింది. మైండ్ బ్లోయింగ్ అని కూడా రాసికొచ్చింది. ఈ పోస్ట్ ఇన్ స్టాలో వైరల్ గా మారింది. ఐకాన్ స్టార్ ని ఉద్దేశించి ఇప్పటివరకూ ఏ హీరోయిన్ ఈ రేంజ్ లో కామెంట్ చేసింది లేదు. మరి కూలెస్ట్ మ్యాన్ అని పుష్పరాజ్ పాత్రలో కోణాన్ని ఉద్దేశించి ఇలా కామెంట్ చేసింది. పుష్పరాజ్ ఇందులో బీడి తాగుతూ కూల్ గా ఉంటాడు. తను ఎవరి జోలికి పోడు..ఎవరైనా తన జోలికి వస్తే ఊరుకోని నైజం. గంధపు దుంగల వ్యాపారంలోకి దిగిన తర్వాత టెన్షన్లు ఉంటాయి. పుష్పరాజ్ అంతకుముందు వరకూ జాన్వీ చెప్పినట్లు కూల్ గయ్ నే కదా. తెలివిగా స్కెచ్ లు వేస్తూ రాజకీయం నడిపించేవాడిగానూ పుష్ప లో యాంగిల్ ఆకట్టుకుంటుంది. ఎర్రచందనం మాఫియా కు డాన్ అయ్యాడంటే.. శ్రీవల్లితో పబ్లిగ్గానే రొమాన్స్ చేశాడంటే.. ఆషామాషీ వ్యవహారమా? అందుకే కూల్ మ్యాన్ అంటూ పుష్పరాజ్ ని జాన్వీ పొగిడేసిందన్నమాట. ఇకపోతే తెలుగులో నటిస్తే విజయ్ దేవరకొండతో పాటు అల్లు అర్జున్ సరసన కూడా అవకాశం వస్తే మిస్ చేసుకోదనడానికి ఇది సింబాలిక్ అని భావించాల్సి ఉంటుంది. బన్ని సరసన జాన్వీ అంటూ ఇంతకుముందు కథనాలు కూడా వైరల్ అయిన సంగతి విధితమే.

## శ్రుతి-శంతను! ఎవరు ముందు ప్రపోజ్ చేశారు?

శ్రుతి హాసన్ ముంబైకి చెందిన ఆర్టిస్ట్ శంతను హజారికాతో రిలేషన్ లో ఉన్న సంగతి తెలిసిందే. గత రెండేళ్లుగా ఈ అభినవ జంట పీకల్లోతూ ప్రేమలో మునిగితేలుతున్నారు. ప్రస్తుతం ముంబైలోనే కలిసి ఉంటున్నారు. రిలేషన్ కి సంబంధించిన అప్ డేట్స్ ని సైతం శ్రుతి హాసన్ ఎప్పటకప్పుడు ఇన్ స్టా వేదికగా చెబుతుంటుంది. తాజాగా ఈ జంట ఇన్ స్టా గ్రామ్ లో అభిమానులతో చిట్ చాట్ లో పాల్గొంది. ఈ క్రమంలో ఇద్దరిలో ఎవరు ముందుగా ప్రపోజ్ చేసారు? అన్న ప్రశ్న ఎదురైంది. దీనికి శ్రుతి హాసన్ నే ముందుగా శంతన్ కి నేనే ప్రపోజ్ చేశానని తెలిపింది. ఐలవ్ యూఅని చెప్పి తన మనసులో ఉన్న ప్రేమను శంతనుతో పంచుకుందిట. అయితే మొదటి నుంచి శ్రుతి హాసన్ అంటే ఇష్టం అన్న భావనలో శాంతను ఉన్నాడట. ఆ ధైర్యంతోనే శ్రుతి హాసన్ మరో ఆలోచన లేకుండా ప్రేమను ఓపెన్ గా చెప్పేసినట్లు రివీల్ చేసింది. మొత్తానికి ఈ జంట ప్రేమాయణం ప్రస్తుతానికి సజావుగానే సాగుతోంది. ఈ బ్యూటీ ప్రేమలో పడటం



ఇదే మొదటిసారి కాదు. ఇటాలియన్ నటుడు మైకేల్ కోర్సలేతో శ్రుతి హాసన్ డీప్ లవ్ ని సాగించింది. కమల్ హాసన్ కి కూడా మైఖేల్ ని పరిచయం చేసింది. పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం సాగింది. కానీ ఏం జరిగిందో ఏమో! ఒక్కసారిగా ఇద్దరికీ బ్రేకప్ జరిగింది. అలాగే ఓ కోలీవుడ్ నటుడు..టాలీవుడ్ నుటుడితోనూ శ్రుతి హాసన్ ప్రేమలో పడినట్లు మీడియాలో ప్రచారం సాగింది. కానీ వాటికి సంబంధించి బలమైన ఆధారాలు అయితే లేవు. మైఖేల్ కోర్సలే తర్వాత శంతనుతో లవ్ ని పబ్లిక్ చేసింది శ్రుతీ. శ్రుతి హాసన్ సినిమాల విషయానికి వస్తే పాన్ ఇండియా చిత్రం సలార్ ప్రభాస్ సరసన నటిస్తోంది. ఇందులో శ్రుతి యాక్షన్ క్వీన్ గా కనిపిస్తుందని సమాచారం. అలాగే ఇటీవలే బాలకృష్ణ సరసన ఓ చిత్రానికి సంతకం చేసింది. మెగాస్టార్ చిరంజీవి-బాబి ప్రాజెక్ట్ లోనూ హీరోయిన్ గా ఛాన్స్ అందుకుంటోందని కథనాలొచ్చాయి.





# బండి సంజయ్ ఔట్.. తెలంగాణ బీజేపీ చీఫ్‌గా కిషన్ రెడ్డి నియామకం

న్యూఢిల్లీ: ఎంపీ బండి సంజయ్‌కు బ్రేక్ వేసింది ఆ పార్టీ అధిష్టానం. ఆయనపై కొన్నాళ్లుగా వినిపిస్తున్న విమర్శలు నిజం అయ్యాయి. దీంతో బండిపై బీజేపీ వేటు వేసింది. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి నుంచి సంజయ్‌ను తొలగించింది. కొత్తగా ఆ అధ్యక్ష బాధ్యతలను కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డికి అప్పగించారు. ఇటీవల బండి సంజయ్‌కు వ్యతిరేకంగా ఈటెల వర్గం ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే. గడిచిన కొన్ని రోజుల నుంచి బండికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. బండి అడ్డగోలుగా సంపాదిస్తున్నట్లు ఆ పార్టీకి చెందిన మరో ఎమ్మెల్యే రఘునందన్ రావు కూడా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బండి సంజయ్ పై బీజేపీ వేటు వేసినట్లు తెలుస్తోంది. ఇక ఇతర రాష్ట్రాలకు కూడా బీజేపీ అధ్యక్షుల్ని మార్చింది. ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షురాలిగా డీ.పురంధేశ్వరిని నియమించారు. జార?ండ్ బీజేపీ అధ్యక్ష బాధ్యతలు సీఎం బాబూలాల్ మరాండీకి దక్కాయి. ఇక పంజాబ్ అధ్యక్షుడిగా సునిల్ జక్కర్‌ను నియమించారు. రాజస్థాన్ బీజేపీ చీఫ్‌గా కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను నియమించారు. బీజేపీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్‌ను .. తెలంగాణ బీజేపీ ఎన్నికల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. ఏపీ మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డిని .. జాతీయ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా నియమించారు. రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇంచార్జీలతో ఏడవ తేదీన బీజేపీ అధిష్టానం భేటీ నిర్వహిస్తోంది. రేపు ఉదయం 10.30 నిమిషాలకు కేంద్ర క్యాబినెట్ సమావేశం జరగనున్నట్లు బీజేపీ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# తెలంగాణకు మరో భారీ పెట్టుబడి.. హర్షం వ్యక్తం చేసిన మంత్రి కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. తాజాగా మరో భారీ పెట్టుబడి వచ్చింది. ఆరిజెన్ ఫార్మా సంస్థ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఫార్మా సంస్థ జీనోమ్ వ్యాలీలో 40 మిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. 250 మందికి పైగా ఉపాధి కల్పించనుంది. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో బయోా మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్‌తో సమావేశం అనంతరం ఆరిజెన్ ఫార్మా సంస్థ ఈ విషయాన్ని ప్రకటించింది. ఆరిజెన్ ఫార్మా సంస్థ నిర్ణయంపై మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు.

# వైద్య రంగంలో తెలంగాణ మరో మైలురాయి..

## దేశం మొత్తం ఎంబీబీఎస్ సీట్లలో మనవే 43 శాతం: మంత్రి హరీశ్‌రావు



హైదరాబాద్ : తెలంగాణలో వైద్యారోగ్యాన్ని బలోపేతం చేసే క్రమంలో ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే దాదాపు అన్ని జిల్లాల్లో మెడికల్ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. ఈ క్రమంలో తెలంగాణ మెడికల్ కాలేజీలు పెరిగాయి. దీంతో ఎంబీబీఎస్ సీట్ల పెంపులో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక మైలురాయిని అందుకుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ట్వీట్ చేశారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీల పరిధిలో 2023-24 విద్యా సంవత్సరానికి గానూ దేశంలో అందుబాటులోకి వచ్చిన మొత్తం మెడికల్ సీట్లలో 43 శాతం సీట్లు తెలంగాణ నుంచి అందుబాటులోకి వచ్చినవే అని హరీశ్‌రావు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. దేశంలో అందుబాటులోకి వచ్చిన 2118 ఎంబీబీఎస్ సీట్లలో 900 సీట్లు తెలంగాణ నుండి వచ్చినవే అని తెలిపారు. జిల్లాకొక మెడికల్ కాలేజీ ఏర్పాటు ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటు, వైద్య విద్యను ప్రజలకు మరింత చేరువ చేసి ఆరోగ్య తెలంగాణ సాకారం చేయాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం అని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మిగతా మెడికల్ కాలేజీలకు అనుమతులు వస్తే సీట్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు హరీశ్‌రావు.

# కాంగ్రెస్ సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ యత్నించింది.. అయినప్పటికీ..



ఖమ్మం: తెలంగాణ జన గర్జన సభను అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసిందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణ జన గర్జన సభకు పెద్ద ఎత్తున హాజరుకావాలన్న సంకల్పంతో ప్రజలు ప్రభుత్వ అడ్డంకులు తొలగించుకొని మరీ సభకు వచ్చారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో దోపిడీని ఆపడం కోసం రాష్ట్ర వ్యాప్తంగా తిరిగినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లా అంటే అనేక భావజాలాలకి పుట్టినిల్లు అని.. అసమానతలు తొలగించడం కోసం అనాదిగా పోరాటం చేసిన గడ్డ అని చెప్పుకొచ్చారు. మన జిల్లా పూర్వ నాయకుల తపన విజ్ఞానం తనకు పాదయాత్రలో ఉపయోగపడ్డాయన్నారు. ఆనాటి గడీల సంస్కృతినే కేసీఆర్ చేస్తున్నారని విమర్శించారు. పునర్నిర్మాణం అంటే ఆనాటి గడీలకు రంగులు వేయించడమా అని ఆయన ప్రశ్నించారు. గోదావరి కృష్ణా జలాలు తెలంగాణకు రావాలన్నారు. తొమ్మిదిన్నర ఏండ్లలో ఒక్క ఎకరానికి కూడా గోదావరి కృష్ణా జలాలు ఇవ్వలేదన్నారు. కాళేశ్వరం ద్వారా ఒక్క ఎకరానికైనా నీళ్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇవ్వకుండా రూ. 80 వేల కోట్లు ఖర్చు పెట్టామని చెపుతున్నారని.. రూ. 20 వేల కోట్లు ఖర్చు పెట్టి ఉంటే ప్రాణహిత చేవెళ్ల ద్వారా నీళ్లు వచ్చేవని చెప్పుకొచ్చారు. శబరి గోదావరి దగ్గర కట్టిన లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేస్తే నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లు పారేవన్నారు. దాన్ని ఆపి ఇప్పుడు సీతారామ ప్రాజెక్ట్ అంటున్నారన్నారు. నీళ్లు నిధులు నియామకాలు గురించి పూర్తి వివరాలతో మళ్ళీ చర్చ పెడతానని తెలిపారు. టీఆర్ఎస్ పార్టీ బీజేపీకి బీ టీం అని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని.. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే అది బీజేపీకి వేసినట్టే అని అన్నారు. రాష్ట్రంలో జన గర్జన లాంటి సభలు ఇంకా ఉంటాయన్నారు. మంత్రి హరీష్ రావు బడాయి మాటలు మాట్లాడటం ఎక్కువైందని మండిపడ్డారు. రెండు సార్లు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కటే సీటు గెలిచారని.. ఈ సారి పదికి పది సీట్లు కాంగ్రెస్ గెలుస్తామని భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

# ఎర్రబెల్లి పుట్టినరోజు సందర్భంగా రక్తంతో ఫొటో ఆర్ట్ వేయించి గిఫ్ట్‌గా ఇచ్చిన బీఆర్ఎస్ యువజన నేత



హైదరాబాద్ : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి %ు% గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జన్మదినం సందర్భంగా.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆయన శిష్యుడు, కేయూ జేఏసీ వైస్ చైర్మన్, భారత రాష్ట్ర సమితి యువజన నాయకుడు మేడారపు సుధాకర్ సరికొత్త పంథాలో తన గురువుపై అభిమానాన్ని చాటుకున్నారు. తన రక్తంతో గీయించిన చిత్రపటాన్ని ఎర్రబెల్లికి గిఫ్ట్‌గా ఇచ్చాడు. రాజకీయ గురువు అయిన ఎర్రబెల్లి దయాకర్ రావు పుట్టినరోజు తన పండుగ రోజు అని పేర్కొన్నాడు. అందుకే బ్లడ్ ఆర్ట్ వేయించానని చెప్పారు.

మేడారపు సుధాకర్ ఆ బ్లడ్ ఆర్ట్‌ను బహూకరించగా ఎర్రబెల్లి మురిసిపోయారు. తనకు పుట్టినరోజు సందర్భంగా మరిచిపోలేని బహుమతి ఇచ్చావని అభినందించారు. సుధాకర్‌ను ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలియజేశారు.



# రాష్ట్రపతి ముర్ముకు స్వాగతం పలికిన సీఎం కేసీఆర్

హైదరాబాద్ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు.. హాకీంపేట్ విమానాశ్రయంలో గ్రాండ్ వెల్కమ్ దక్కింది. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ముగింపు ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆమె హైదరాబాద్‌కు వచ్చారు. తెలంగాణ సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళసైతో పాటు మంత్రులు .. హాకీంపేట్‌కు వెళ్లి ముర్ముకు స్వాగతం పలికారు. గచ్చిబౌలి స్టేడియంలో జయంతి ముగింపు ఉత్సవాలు జరగనున్నాయి. ప్రత్యేక ఎయిర్‌ఫోర్స్ విమానంలో ముర్ము హాకీంపేట చేరుకున్నారు. అక్కడ ఆమెకు రెడ్‌కార్పెట్ వెల్కమ్ దక్కింది. సీఎం కేసీఆర్, గవర్నర్ తమిళసై వెళ్లి ఆమెకు వెల్కమ్ పలికారు.

పుష్పగుచ్ఛం ఇచ్చి అభివాదం చేశారు. సీఎం కేసీఆర్‌తో పాటు సీఎస్ శాంతికుమారి, తెలంగాణ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా రాష్ట్రపతి ముర్ముకు పుష్పగుచ్ఛాలు అందించారు.

# దేశంలో ప్రైవేటు దేవాలయాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ: మంత్రి తలసాని



హైదరాబాద్: దేశంలో ప్రైవేటు దేవాలయాలకు ఆర్థిక సాయంత అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఉదయం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో ప్రభుత్వ ఆర్థిక సాయం చెక్కులను అందజేసిన సందర్భంగా మంత్రి మాట్లాడారు. అమ్మవారికి సమర్పించనున్న చీర తయారీని ఆయన మగ్గంపై ప్రారంభించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే సీఎం కేసీఆర్ బోనాల పండుగను రాష్ట్ర పండుగా ప్రకటించారని మంత్రి తలసాని గుర్తుచేశారు. దాంతో తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే బోనాలు నేడు విశ్వవ్యాప్తం అయ్యాయని అన్నారు. పండుగలు గొప్పగా జరుపుకోవాలి, ప్రజలు సంతోషంగా ఉండాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచన అని చెప్పారు. బోనాలను ఘనంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో ఆలయాలకు ఆర్థిక సాయం కోసం ప్రభుత్వం రూ. 15 కోట్లు విడుదల చేసిందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు బోనాలకు పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మంత్రి చెప్పారు.

# వైద్య విద్యను అభ్యసించాలనుకునే తెలంగాణ విద్యార్థులకు ప్రభుత్వం గుడ్ న్యూస్



హైదరాబాద్: వైద్య విద్యను అభ్యసించాలనుకునే తెలంగాణ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. తెలంగాణ స్టేట్ మెడికల్ కాలేజెస్ అడ్మిషన్ రూల్స్ కు సవరణ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ రీ ఆర్గనైజేషన్ అక్ట్, ఆర్టికల్ 371%ఐ% నిబంధనలకు లోబడి అడ్మిషన్ రూల్స్ కు సవరణ చేశారు. దీని ప్రకారం 2014 జూన్ 2 తర్వాత ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లోని కాంపిటేటివ్ అథారిటీ కోటాలోని 100 శాతం మెడికల్ సీట్లను తెలంగాణ విద్యార్థులకే రిజర్వ్ చేయాల్సి ఉంటుంది. అంతకుముందు 85 శాతం మాత్రమే స్థానిక విద్యార్థులకు ఉండగా, మిగతా 15 శాతం సీట్లు అన్ రిజర్వుడుగా ఉండేవి. ఆ సీట్లకు తెలంగాణతోపాటు ఏపీ విద్యార్థులు కూడా పోటీ ఎంబీబీఎస్ సీట్లు పొందేవారు. తాజా సవరణ వల్ల తెలంగాణ విద్యార్థులకు ఎక్కువ ఎంబీబీఎస్ సీట్లు దక్కనున్నాయి. కాగా, తెలంగాణ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలను చేరువ చేయడంతో పాటు, తెలంగాణ విద్యార్థులకు వైద్య విద్య అందించేందుకు సీఎం కేసీఆర్ జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి రాష్ట్రంలో 20 మెడికల్ కాలేజీలు ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 56కు చేరింది. నాడు తెలంగాణలో 2850 ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉంటే, ఇప్పుడు 8340 సీట్లకు పెరిగింది. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉన్న 20 మెడికల్ కాలేజీల్లోని 2,850 సీట్లలో కాంపిటెంట్ అథారిటీ కోటా కింద 1,895 సీట్లు ఉండేవి. అందులో 15 శాతం అన్ రిజర్వుడు కోటాగా 280 సీట్లను కేటాయించాల్సి వచ్చేది. అన్ రిజర్వుడు కోటాలో తెలంగాణ విద్యార్థులతో పాటు, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు సీట్లు పొందేవారు. దీంతో తెలంగాణ విద్యార్థులు సీట్లు కోల్పోవాల్సి వచ్చేది. ఇదే విధానం కొనసాగితే పెరిగిన మెడికల్ కాలేజీల్లో కూడా 15 శాతం అన్ రిజర్వుడు కోటా అమలు చేయాల్సి ఉంటుంది. దాంతో మరిన్ని సీట్లు తెలంగాణ విద్యార్థులు కోల్పోవాల్సి వస్తుంది. దీన్ని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం, అన్ రిజర్వుడు కోటాను కేవలం పాత 20 మెడికల్ కాలేజీలకు మాత్రమే పరిమితం చేస్తూ నిబంధనలకు సవరణ చేసింది. కొత్తగా వచ్చిన 36 మెడికల్ కాలేజీలకు ఆ నిబంధన వర్తించకుండా తాజా సవరణ చేసింది. దీంతో తెలంగాణ విద్యార్థులకు 520 మెడికల్ సీట్లు అదనంగా లభిస్తున్నాయి. ఇప్పటికే ఎంబీబీఎస్ బి కేటగిరి సీట్లలో 85 శాతం సీట్లు తెలంగాణ విద్యార్థులకే చెందేలా లోకల్ రిజర్వ్ చేసుకోవడంవల్ల తెలంగాణ విద్యార్థులకు అదనంగా 1300 ఎంబీబీఎస్ సీట్లు పెరిగిన విషయం తెలిసిందే. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ రెండు నిర్ణయాలవల్ల మొత్తం 1820 సీట్లు అదనంగా ప్రతి ఏటా దక్కనున్నాయి. కొత్త మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోట 15% సీట్లు యధాతథంగా ఉంటాయి. వాటిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా దేశంలో ఎక్కడివారైనా మెరిట్ ప్రకారం అడ్మిషన్ పొందవచ్చు.

# బీఆర్ఎస్ వాళ్లే పరిపక్వత లేని నేతలు



హైదరాబాద్: రాహుల్‌గాంధీపై బీఆర్ఎస్ నేతలు చేసిన వ్యాఖ్యలను తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ మల్లు రవి తిప్పికొట్టారు. "పరిపక్వత లేని నేతలు బీఆర్ఎస్ వాళ్లే. స్థితప్రజ్ఞత ఉన్న నేత రాహుల్. దేశంలో అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడు రాహుల్ గాంధీ. ఏది మంచో.. ఏది చెడో.. ఎక్కడ ఎలా ప్రవర్తించాలో.. జయాపజయాలను ఎలా స్వీకరించాలో అన్ని తెలిసిన నాయకులు రాహుల్ గాంధీ. త్యాగానికి, దేశ సేవకు అంకితమైన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీ గురించి బీఆర్ఎస్ నేతలు పరిపక్వత లేదని మాట్లాడటం వారి నీచ రాజకీయాలకు పరాకాష్ట. పరిపక్వత అంటే అడ్డగోలుగా అవినీతి చేయడమా? ఇతర పార్టీ నాయకులను అడ్డగోలుగా గుంజుకొని అధికారం చేయడమా? నియంతలాగా పోలీసులను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయడమా.. ? రాహుల్ గాంధీ ప్రజల కోసం పని చేస్తున్న నేత.. ఆయన దేశంలో కోట్లాది ప్రజల మనసులు దోచుకున్న నేత. దేశాన్ని విద్వేషాల నుంచి ఐక్యత సాధించేందుకు 4 వేల కిలోమీటర్లు కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు పాదయాత్ర చేసిన మహా మనిషి. అలాంటి గొప్ప నిస్వార్థ నేత గురించి పనికిరాని నాయకులు అడ్డగోలుగా మాట్లాడితే తెలంగాణ ప్రజలు తిప్పికొడుతారు." అని మల్లు రవి హెచ్చరించారు.

# జడ్చర్లలో రోడ్డు ప్రమాదం.. ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు.. భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్



జడ్చర్ల: జడ్చర్లలో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జడ్చర్ల పట్టణానికి సమీపంలో 44వ నెంబర్ జాతీయ రహదారిపై వరి పొట్టు లోడుతో వెళ్తున్న ఓ లారీ అదుపు తప్పి బోల్తాపడింది. లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో ఆ మార్గంలో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. దాంతో ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు ఒకవైపు లారీని రోడ్డుపై నుంచి తొలగించే ఏర్పాట్లు చేస్తూనే, మరోవైపు ట్రాఫిక్‌ను వన్‌వేలోకి మళ్లించారు.

దాంతో వన్‌వేలో నాలుగు వాహనాలు ఒకదానికి ఒకటి ఎదురెదురుగా ఢీకొన్నాయి. దాంతో రెండు వైపులా కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ ప్రమాదాల్లో ఒకరు మృతిచెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టు మార్టానికి పంపించారు. కాగా, ప్రమాదానికి సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com